

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem STRUGGLE FOR JUSTICE TV

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 348 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 19, నవంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్









డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

# వీసీలు 'మొల్లంచి' పనిచేయాలి !

- సీఎం రేవంత్ కున్న ధ్యాస ఒక్క విసిగి లేదు
- సీఎం ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నారు
- వీసీలు విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేస్తున్నారు
- అరకోర సమయపాలనలతో ఏసీ రూములకు పరిమితమైపోతున్నారు
- విశ్వవిద్యాలయాలను ఇంచుమించు ప్రైవేట్ పరం చేసేసారు
- విశ్వవిద్యాలయాలను విద్యా వ్యాపారాలకు కేరాఫ్ అడ్రస్ లుగా నిలిపారు
- అవినీతి అక్రమార్కులను పెంచి పోషించడంలో ఆరితేరిపోతున్నారు
- అందరూ వీసీలు అంత గొప్పగా చదువుకున్నవాళ్లే విశ్వవిద్యాలయాలు ఎందుకు భ్రష్టుపడుతున్నాయి
- సీఎం దూరదృష్టికి వీసీల పనితనానికి బోలెడంత తేడా ఉంది
- నోటిఫికేషన్ అనేసరికి అక్రమాల కోసం ఉరకలాడుతున్న వీసీలు
- రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపీఎస్ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కడుతున్నారు
- డాక్టర్ బరిగెల శివ



తెలంగాణలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తుంటే.. విశ్వవిద్యాలయాల అభివృద్ధి మాత్రం ఆశించిన స్థాయిలో సాగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వంటి కార్యక్రమాలతో ప్రభుత్వం విద్యారంగంలో కొత్త మార్పులకు శ్రీకారం చుడుతోంది. మరోవైపు ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో వీసీల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. విద్యార్థుల సమస్యలు, బోధన, పరిశోధన, మౌలిక వసతుల అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విశ్వవిద్యాలయాలు విద్యాకేంద్రాలుగా కాకుండా రాజకీయాలు, పరిపాలనా వివాదాలకు వేదికలుగా మారుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా 429 పోస్టుల నియామక ప్రక్రియ నేపథ్యంలో రోస్టర్ విధానం, బ్యాక్‌లాగ్ పోస్టులపై వివాదాలు తెరపైకి వచ్చాయి. నియామకాల్లో పారదర్శకత, నిబంధనల అమలుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీసీలు బాధ్యతాయుతంగా వ్యవహరించకపోతే ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని డాక్టర్ బరిగెల శివ హెచ్చరిస్తున్నారు. ముఖ్యమంత్రి విద్యాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా విశ్వవిద్యాలయాల పాలనలోనూ సమూల మార్పులు రావాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. విశ్వవిద్యాలయాలను ప్రక్షాళన చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన బాధ్యత వీసీలపై ఉందని స్పష్టం చేస్తున్నారు. - హైదరాబాద్ జై భీమ్ డెస్క్

2

## గత ఆంధ్ర పాలకుల కంటే రేవంత్ రెడ్డి వల్లే తెలంగాణకు ఎక్కువ నష్టం జరుగుతోంది: కేటీఆర్

కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్న కేటీఆర్

సాగర్ ప్రాజెక్టు నుంచి ఏపీ 90 టీఎంసీల నీటి మళ్లింపునకు యత్నిస్తోందని ఆరోపణ

జల్ జీవన్ మిషన్ పేరుతో నీటి వినియోగానికి కేంద్రం సహకరిస్తోందని విమర్శ



2



## ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత: సీఎం రేవంత్ రెడ్డి

విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సముచిత అవకాశాలు కల్పిస్తున్నాం..

ఎస్సీ వర్గీకరణ అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శం

2

## టాస్క్‌ఫోర్స్ సోదాలపై హైకోర్టు నోటీసులు

డీజీపీ, హోంశాఖకు వివరణ ఇవ్వాలని ఆదేశం

సాధారణ దుస్తుల్లో తనిఖీలపై అభ్యంతరాలు

ఎఫ్ఐఆర్ లేకుండా సోదాలు ఎలా?


బీఎన్ఎస్ఎస్ నిబంధనల ఉల్లంఘనపై పిటిషన్

డిసెంబర్‌కు విచారణ వాయిదా

2




## స్థానిక ఎన్నికల్లో సమన్వయంతో సాగాలి



కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

23 పట్టణ స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికలపై సమీక్ష

2

గ్రామస్థాయి నుంచి బలమైన నాయకత్వం రావాలి

ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

2029 ఎన్నికలే లక్ష్యంగా ప్రణాళికలు ఉండాలి

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత: సీఎం రేవంత్ రెడ్డి

**విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సముచిత అవకాశాలు కల్పిస్తున్నాం..**
**ఎస్సీ వర్గీకరణ అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శం**



**హైద్రాబాద్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

షెడ్యూల్డ కులాలు, షెడ్యూల్డ తెగల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సముచిత అవకాశాలు కల్పిస్తూ వారి అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, తీసుకున్న నిర్ణయాలు, సాధించిన పురోగతిని ముఖ్యమంత్రి వివరించారు. రాజకీయ రంగంలోనూ దళితులకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తున్నామని, శాసనసభ స్పీకర్ పదవితో పాటు మంత్రివర్గంలో అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు వివిధ కార్పొరేషన్లలోనూ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అవకాశాలు కల్పించిన విషయాన్ని ప్రస్తావించారు. వందేళ్ల ఉస్మానియా విశ్వవిద్యాలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా దళితుడికి వైస్ ఛాన్సలర్‌గా అవకాశం కల్పించామని, ఉస్మానియా విశ్వవిద్యాలయంతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ ఐఐఐటీలలోనూ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారికి వీసీలుగా అవకాశం ఇచ్చినట్లు వివరించారు. అర్హత, అవకాశం ఉన్న ప్రతి రంగంలోనూ ఆయా వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్), ఆరోగ్యశ్రీ పథకాల కింద ఖర్చు చేస్తున్న నిధుల్లో 50 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం వినియోగిస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణ అమలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుపై పార్లమెంటరీ కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు. ఈ సమావేశంలో పార్లమెంటరీ కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు రవి, తాహీర్ గావ్, హరీశ్ చంద్ర మీనా, అనిల్ ఫిరోజియా, అరుణ్ కుమార్, దగ్గుమల్ల ప్రసాద రావుతో పాటు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, పలువురు శాసనసభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గత ఆంధ్ర పాలకుల కంటే రేవంత్ రెడ్డి వల్లే తెలంగాణకు ఎక్కువ నష్టం జరుగుతోంది: కేటీఆర్

**కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్న కేటీఆర్**
**సాగర్ ప్రాజెక్టు నుంచి ఏపీ 90 టీఎంసీల నీటి మళ్లింపునకు యత్నిస్తోందని ఆరోపణ**
**జల్ జీవన్ మిషన్ పేరుతో నీటి వినియోగానికి కేంద్రం సహకరిస్తోందని విమర్శ**

**హైదరాబాద్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్) :**

తెలంగాణ సాగునీటి, తాగునీటి ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ... నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి దాదాపు 90 టీఎంసీల కృష్ణా నది నీటిని మళ్లించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ ప్రక్రియకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరోక్ష సహకారం ఉంటోందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీరు వల్ల తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతోందని ఆయన విమర్శించారు. జల్ జీవన్ మిషన్ పేరుతో ఏపీ చేపడుతున్న నీటి వినియోగానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇస్తోందని మండిపడ్డారు. గతంలో ఆంధ్ర పాలకుల కంటే రేవంత్ రెడ్డి పాలనలోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరుగుతోందని అన్నారు. సాగర్ ప్రాజెక్టు వద్ద గత ఏడాది కాలంగా జరుగుతున్న పనులపై తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం లేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఏపీ నీటి మళ్లింపు యత్నాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు (కేఆర్ఎంబీ) అధికారికంగా ఏమైనా ఫిర్యాదు చేశారా? అని నిలదీశారు. అలాగే రాష్ట్ర తాగునీటి అవసరాల నిమిత్తం మిగిలిన 40 టీఎంసీల కేటాయింపులను కోరుతూ ప్రభుత్వం వెంటనే కేఆర్ఎంబీకి లేఖ రాయాలని అన్నారు.

# టాస్క్‌ఫోర్స్ సోదాలపై హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్) :**

హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చట్టబద్ధ నిబంధనలు పాటించకుండా సోదాలు, తనిఖీలు నిర్వహిస్తున్నారన్న పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు స్పందించింది. బోరబండకు చెందిన బి. బాలరాజ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ మాధవి దేవి రాష్ట్ర హోంశాఖ, డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, టాస్క్‌ఫోర్స్ డీసీపీలకు నోటీసులు జారీ చేసి ఆరోపణలపై సమగ్ర వివరణ ఇవ్వాలని ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పోలీసు యూనిఫాం లేకుండా సాధారణ దుస్తుల్లో వచ్చి తనిఖీలు నిర్వహిస్తున్నారని, ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే సోదాలు చేసి వస్తువులు స్వాధీనం చేసుకుంటున్నారని పిటిషనర్ ఆరోపించారు. ఎఫ్ఐఆర్‌కు ముందే ఏకపక్షంగా దర్యాప్తు చేపట్టడం బీఎన్ఎస్ఎస్--2023 నిబంధనలకు విరుద్ధమని, సంబంధిత వ్యక్తులకు తమ వాదన వినిపించే అవకాశం కల్పించడం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. సెర్చ్ వారెంట్లు జారీ చేసే అధికారం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లకే ఉండగా, ఏసీపీ స్థాయి అధికారులు వాటిని జారీ చేయడం చట్టబద్ధం కాదని పేర్కొన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ప్రతివాదుల నుంచి వివరణ కోరుతూ తదుపరి విచారణను డిసెంబర్‌కు వాయిదా వేశారు.

# వీసీలు మొల్లంచి పనిచేయాలి

**సీఎం రేవంత్ కున్న ధ్యాస ఒక్క విసిగి లేదు**
**సీఎం ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నారు**
**వీసీలు విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేస్తున్నారు**
**అరకోర సమయపాలనలతో ఏసీ రూములకు పరిమితమైపోతున్నారు**
**విశ్వవిద్యాలయాలను ఇంచుమించు ప్రైవేట్ పరం చేసేసారు**
**విశ్వవిద్యాలయాలను విద్యా వ్యాపారాలకు కేరాఫ్ అడ్రస్ లుగా నిలిపారు**
**అవినీతి అక్రమార్కులను పెంచి పోషించడంలో ఆరితేరిపోతున్నారు**
**అందరూ వీసీలు అంత గొప్పగా చదువుకున్నవాళ్లే విశ్వవిద్యాలయాలు ఎందుకు బ్రష్టుపడుతున్నాయి**
**సీఎం దూరదృష్టికి వీసీల పనితనానికి బోలెడంత తేడా ఉంది**
**నోటిఫికేషన్ అనేసరికి అక్రమాల కోసం ఉరకలాడుతున్న వీసీలు**
**రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపీఎస్ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కడుతున్నారు**
**డాక్టర్ బరిగెల శివ**

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

తెలంగాణ రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల అభివృద్ధికి వీసీల ఒంటెద్దు పాలనే ఆటంకంగా మారుతుందని డాక్టర్ బరిగెల శివ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక నూతనంగా నియమించబడిన విశ్వవిద్యాలయాల వీసీలు తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యాభివృద్ధికి విశ్వవిద్యాలయాల అభివృద్ధికి దోహదపడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి పేరు ప్రఖ్యాతలు తీసుకు రాగలరని ఎంతగానో ఆశించిన సందర్భంలో రాష్ట్రంలో వీసీల పాలన రెండు సంవత్సరాల పూర్తి కాగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిస్థితి అత్యంత దయనీయమైన స్థితిలోనికి నెట్టివేయబడినదని తీవ్రంగా మండిపడ్డారు. ఎంతో ఉన్నతమైన విద్యతో ఎంతో పరిపాలన అనుభవంతో చదువుకున్న మేధావులనైన ఆచార్యులను తెలంగాణలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు వీసీలుగా నియమిస్తే వీసీలుగా నియమించబడిన అధికారులు విద్యాభివృద్ధిని పక్కనపెట్టి రాజకీయ అభివృద్ధిని అవినీతి అభివృద్ధిని అక్రమాల అభివృద్ధిని విద్యా దోపిడి అభివృద్ధిని అరాచక శక్తుల అభివృద్ధిని విశ్వవిద్యాలయాల్లో పెంపొందిస్తున్నారని రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిస్థితులు తెలియజేస్తున్న అన్నారు. విశ్వవిద్యాలయాల్లో వీసీల పరిస్థితి దారుణంగా మారిపోయిందని వీసీలు కేవలం అరకొర సమయాన్ని పరిపాలన కోసం కేటాయిస్తూ ఆకాస్తా సమయంలో అధికార సమావేశాలతో సెమినార్ల సమావేశాలతో పరిపాలన సమావేశాలతో కేటాయిస్తూ చేతులు దులిపేసుకుని వెళ్లిపోతున్నారని సుడిగా ప్రశ్నించారు. విద్యార్థులను పట్టించుకోకుండా విశ్వవిద్యాలయాల అభివృద్ధిపై పునఃసమీక్షలు నిర్వహించకుండా వాళ్లకి ఇష్టం వచ్చినట్టుగా ప్రవర్తిస్తుండడం వల్ల విశ్వవిద్యాలయాల భవిష్యత్తు పూర్తిగా నాశనం అయిపోతుందని మండిపడ్డారు. ఎంతో ఉన్నతమైన విద్యను చదువుకున్న వీసీలు పూర్తిగా బాధ్యతను మరిచిపోయి అబద్దాలతో పుటలు గడుపుతూ ప్రతి విశ్వవిద్యాలయంలో గ్రూపు రాజకీయాలను పెంచి పోషిస్తూ విద్యాభివృద్ధికి ఆటంకమార్గాలను సృష్టిస్తున్నారని మండిపడ్డారు.

**సీఎం దూర దృష్టిపై వీసీల విలువెంత..**

తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి కునుకుపాటి సమయం లేకుండా ప్రతి శాఖపై ప్రత్యేకమైన నగర్ వేస్తూ రాష్ట్ర పాలనను ముందుకు నడిపిస్తుండగా విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతూ దేశంలోనే ఎక్కడ లేని విధంగా హైదరాబాదులో స్కిల్ డెవలప్మెంట్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశాడని దానితోపాటు 119 నియోజకవర్గాల్లో ఇండియా



ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం కోసం ప్రతి పాఠశాలకు 200 కోట్ల అభివృద్ధితో నూతనమైన ప్రభుత్వ విద్యా విధానానికి శ్రీకారం చుట్టారని తెలియజేశారు. గత ప్రభుత్వం గురుకులాలను అభివృద్ధిపరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అభివృద్ధితో ప్రతి నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యా విధానాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఒక అడుగు ముందు వేసి పాఠశాలల ప్రారంభోత్సవానికి రెండు నెలల ముందే బడి పిల్లలకు పుస్తకాలు స్కూల్ బ్యాగ్స్ యూనిఫార్మ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ విద్యపై తనకున్న ప్రేమానురాగాలను కనపరిచారని స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్ విద్యాసంస్థలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి కళాశాలలోనే విద్యార్థులు భోజనం చేసి అక్కడే చదువుకోవాలని ఇంటర్ విద్యార్థులపై తన ఉదాహరణ చాటుకోవడంతోపాటు ఇంటర్ విద్య బలోపేతానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. దానితోపాటు రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపీఎస్ తెలంగాణ యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణం చేపడుతూ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయుటకు చేస్తున్న ప్రయత్నం ఏదైతే ఉందొ నా భూతో నా భవిష్యత్ అన్నారు. ఒక రాష్ట్రం ముఖ్యమంత్రి సర్వ కష్టాలు పడుతూ ప్రభుత్వ విద్యను కాపాడాలని ఎంత అయితే ప్రయత్నం చేస్తున్నారో ఒక రాష్ట్ర డిజిపి ప్రభుత్వ విద్య కోసం ఒక యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణం చేస్తూ ప్రభుత్వ విద్య పట్ల ఎంత పట్టుదలతో ఉన్నారో వాళ్ల వాళ్ల భావాలను క్రియా రూపంలో అభివృద్ధి రూపంలో చేసి నిరూపిస్తుంటే అంత గొప్పగా చదువుకున్న వీసీలు పరిపాలన అనుభవం కలిగిన అధికారులుగా ఉంటూ ప్రభుత్వ విద్యను ఏర్పడకుండా నాశనం చేస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తేవడమే కాకుండా అన్ని విశ్వవిద్యాలయాలలోని పరిధిలోగల విద్యాసంస్థలలో చదువుకుంటున్న లక్షలాది మంది విద్యార్థులను ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకతను పెంచుకునే విధంగా కుట్రలు చేస్తున్నారని దీనికంతటికి కారణం అన్ని విశ్వవిద్యాలయాలలోని వీసీలు అరాచక శక్తుల చేతుల్లో అవినీతిపరుల చేతుల్లో అక్రమార్కుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిపోయి ప్రభుత్వ విద్యను పరాయి విద్యలా భావించే విధంగా చేస్తున్నారని మండిపడ్డారు.

**విద్యార్థుల హక్కులను నాశనం చేస్తున్న వీసీలు..**

అధికారిక హోదాలో తమకు తిరుగులేదని భావించుకుంటున్న వీసీలు వాళ్ళ హోదాలను చూసి గర్వం పెంచుకొని విద్యార్థుల జీవితాలను నాశనం చేయడానికి వినూత్న ప్రయత్నాలు చేస్తున్నారని సూటిగా నిలదీశారు. ప్రతి విశ్వవిద్యాలయంలో వీసీలకు అనుకూలమైన పనులను రాత్రికి రాత్రే పూర్తి చేసుకుంటూ అధికారులకు అనుకూలమైన పనులను అవినీతిపరులకు అనుకూలమైన పనులను అరాచక శక్తులకు అనుకూలమైన పనులను ఎప్పటికప్పుడు నెరవేర్చుకుంటూ అధికార హోదాలలో వాళ్ళ ఆధిపత్యాన్ని స్పష్టంగా కనపరుస్తున్నారన్నమాట మాత్రం పచ్చి నిజం లాంటిది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రత్యక్షంగాను పరోక్షంగాను తీవ్ర స్థాయిలో మోసం చేస్తున్నారన్నది రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోయినా అన్ని విశ్వవిద్యాలయాలలోని మేధావులు స్పష్టంగా గుర్తిస్తున్నారు అన్నారు. ముఖ్యంగా ప్రతి వీసి విద్యార్థుల సమస్యలు అనేసరికి రెండు సంవత్సరాలుగా కాలయాపన చేస్తూ వాటిపై విశ్వవిద్యాలయ సమాజానికే కాకుండా ప్రభుత్వానికి ప్రభుత్వ అధికారులకు తప్పుడు సమాచారాలను తప్పుడు సంకేతాలతో పాటు దుష్ప్రచారాలను చేస్తూ ఆయా వీసీలు ఎంతో నిజాయితీపరులుగా నిరూపించుకోవడం కోసం తహతహలాడుతూ వాళ్లు రహస్యంగా పెంచి పోషిస్తున్న అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకోవడం కోసం విద్యార్థుల సమస్యలను బూచిగా చూపిస్తూ పబ్బం గడుపుతున్నారన్నారు. ప్రతి విశ్వవిద్యాలయంలోని వీసీల పాలన ప్రభుత్వానికి ఏ విధమైన మేలు చేస్తుందో లేదో తెలియదు గాని కీడు మాత్రం తలపెడుతుందన్నది పచ్చి నిజమన్నారు. ప్రతి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసం అధికారులతో కలిసి వీసీలతో కలిసి పలు సమావేశాలు నిర్వహించాల్సి ఉండేనని వీసీల తీరు పట్ల వీసీల మొండితనం పట్ల ప్రజాప్రతినిధులు సమీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల కష్టసుఖాలను విద్యార్థుల బాధలను విద్యార్థుల సమస్యలను తెలుసుకొని వాళ్లకు రక్షణగా నిలవాల్సింది పోయి వీసీలు మా మాట వినడం లేదంటూ వీసీలు మా ఫోన్ లకు స్పందించడం లేదంటూ చేతగాని సమాధానాలతో దాటవేస్తున్నారన్నారు.

**నోటిఫికేషన్ హవా...**

రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పరిధిలోని విశ్వవిద్యాలయాలలో ఇప్పటికే 429 పోస్టులతో రెగ్యులర్ నోటిఫికేషన్ విడుదల చేయగా వీసీల హంగామా మామూలుగా లేదని ఎవరికి తోచిన విధంగా వాళ్ళు దిక్కుమాలిన రూల్స్ ను ఏర్పాటు చేసుకొని వాళ్ళ వాళ్ళ విశ్వవిద్యాలయాలకు కేటాయించబడిన పోస్టులను ఏ విధంగా వాళ్ళకబంధహస్తాల్లోనికి లోపర్చుకోవాలో ఏ విధంగా వాళ్లకు అనుకూలమైన వర్గాలకు ఇప్పించుకోవాలో ఆయా విశ్వవిద్యాలయాలలో ఆయా విభాగాలలో కింది స్థాయి అధికారులు సూచించిన నియమాలను రాష్ట్ర ప్రభుత్వం వద్దకు తీసుకెళ్లి వాటిని బలవంతంగా అమలుపరచడం కోసం అక్రమ మార్గాలన్నిటిని సక్రమమార్గం చేయడం కోసం ప్రభుత్వ పెద్దలతో రాష్ట్ర ఉన్నత విద్యాసంస్థల అధికారులతో తీవ్రంగా పోరాటాలు చేస్తున్నారన్నారు. వాటితోపాటు ప్రతి విశ్వవిద్యాలయంలో కేవలం బ్యాక్లాగ్ల రూపంలో కొన్ని పోస్టులు నిర్మించుకొని వాటిని అమ్ముకోవడం కోసం అప్పుడే దళారీ వ్యవస్థను తయారు చేశారని వాటి వల్ల తీరికలేని సమయాలతో వీసీలు హైదరాబాదులోని సెక్రటేరియట్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంస్థ కార్యాలయం చుట్టూ తిరుగుతూ, విశ్వవిద్యాలయాల పరిపాలనను గాలికి వదిలేసి ఉద్యోగాలను పైరవీ రూపంలో అమ్ముకోవాలనే దగుల్బాజీల కోసం తెగ గావరపడుతున్నారని స్పష్టం చేశారు. బ్యాక్ లాగ్ ఉద్యోగాలకు ప్రతి విశ్వవిద్యాలయంలో చివరిసారి నిర్వహించబడిన నియామక ప్రక్రియలోని ఖాళీలను అనుసరిస్తూ కోర్టు కేసులను పాటిస్తూ పైరవీలు చేసుకుంటుండగా 429 పోస్టులలో ప్రతి విశ్వవిద్యాలయంలోని చివరి నియామక ప్రక్రియ రోస్టర్ ను ఎందుకు పాటించడం లేదంటూ సూటిగా నిలదీశారు.కేవలం ఉద్యోగాలు అమ్ముకోవడం కోసం మాత్రమే యూనివర్సిటీ యూనిట్ రోస్టర్ ను పాటించడానికి ప్రభుత్వాన్ని బలవంత పెడుతున్నారని అందులో భాగంగానే కొన్ని విభాగాలలో ఎక్కువ పోస్టులు మరికొన్ని విభాగాలలో పోస్టులకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రవర్తించడం ఉద్యోగాలు అమ్మకానికి పెట్టడం కాకపోతే మరేమిటో విశ్వవిద్యాలయాల వీసీలే తెలియజేయాలన్నారు. మొత్తం మీదుగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక రాష్ట్ర డిజిపి ప్రభుత్వ విద్యను బ్రతికించడానికి తీవ్రంగా ప్రయాస పడుతుంటే అన్ని తెలిసిన వీసీలు ప్రభుత్వ విద్యుతో వ్యాపారం చేస్తూ ప్రభుత్వ విద్యను అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారని ప్రైవేటు విద్యకు ఆద్యం పోస్తూ విద్యా వ్యాపారాలకు పాల్పడుతున్నారన్నది నిజంతో పాటు సిగ్గుకరమన్నారు. ప్రస్తుత వీసీలతో నియామక ప్రక్రియ చేపడితే కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి అధోగతేనంటూ ముందస్తుగా హెచ్చరించారు.

# స్థానిక ఎన్నికల్లో సమన్వయంతో సాగాలి

**కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి**
**23 పట్టణ స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికలపై సమీక్ష**
**గ్రామస్థాయి నుంచి బలమైన నాయకత్వం రావాలి**
**ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి**
**2029 ఎన్నికలే లక్ష్యంగా ప్రణాళికలు ఉండాలి**

**అమరావతి, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్) :**

రాష్ట్రంలో జరగనున్న 23 పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయానికి సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికల సన్నద్ధతపై కూటమి ముఖ్య నేతలు, గ్రామస్థాయి కార్యకర్తలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన దిశానిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయిలో మూడు పార్టీల మధ్య ఉన్న ఐక్యత, సమన్వయం గ్రామస్థాయి వరకు కనిపించాలని, స్థానిక సమస్యలకు అక్కడే పరిష్కారం లభించేలా బలమైన నాయకత్వాన్ని తయారు చేయాలని సూచించారు.



ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీలు, పీ4 కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలకు అందిస్తున్న సహాయం, మౌలిక సదుపాయాల కల్పన, పారిశ్రామిక పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, రహదారుల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి వంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు మంచి చెడులను బేరీజు వేసుకుని తీర్పు ఇచ్చారని గుర్తుచేస్తూ, ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించాలని కోరారు. ప్రత్యర్థి పార్టీ రాజకీయ విధానాలు, వివాదాస్పద వైఖరిని ప్రజలకు వివరించి అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రతి ఓటు కీలకమని, కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలవాలని చెప్పారు. రానున్న 2029 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలతో ముందుకు సాగాలని చంద్రబాబు సూచించారు.

# సిద్ధాపూర్, జయగిరి గ్రామాల్లో నూతన చేయూత పెన్షన్ పత్రాల పంపిణీ







**పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం..**
**అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయం**
**మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేణికుంట్ల అశోక్ కుమార్**

**హాసన్‌పర్తి, నవంబర్ 18(జై భీమ్ న్యూస్)**

వర్ధన్నపేట శాసనసభ్యులు ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు హాసన్‌పర్తి మండలంలోని సిద్ధాపూర్, జయగిరి గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పెన్షన్ పథకం ద్వారా నూతనంగా మంజూరైన పెన్షన్ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాసన్‌పర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేణికుంట్ల అశోక్ కుమార్ పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ముందుగా సిద్ధాపూర్ గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అనంతరం జయగిరి గ్రామానికి చేరుకుని నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రేణికుంట్ల అశోక్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రజాపాలన కొనసాగిస్తోందని అన్నారు. సమాజంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించాలనే గొప్ప ఉద్దేశంతో ప్రభుత్వం చేయూత పెన్షన్ పథకాన్ని అమలు చేస్తోందని వివరించారు. ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబాలకు పెన్షన్ ఎంతో ఆసరాగా నిలుస్తుందని, ముఖ్యంగా వృద్ధాప్యంలో ఇతరులపై ఆధారపడకుండా గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేందుకు ఈ పథకం దోహదపడుతుందని పేర్కొన్నారు. గతంలో పెన్షన్ల కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ ఎదురుచూసిన అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. పెన్షన్ అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, నిరుపేదలకు ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న భరోసా అని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, ఎలాంటి రాజకీయ వివక్షకు తావులేకుండా అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు నాయకత్వంలో వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ, వారికి రావాల్సిన సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం అందుబాటులో ఉంటామని అశోక్ కుమార్ స్పష్టం చేశారు. చేయూత పెన్షన్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల రాకేష్ రెడ్డి, మల్లారెడ్డిపల్లి పీఏసీఎస్ చైర్మన్ కుమారస్వామి, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, మాజీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సిజేరియన్ ప్రసవాలను తగ్గించి సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

**ప్రైవేట్ ఆసుపత్రులు అనవసర సిజేరియన్లకు దూరంగా ఉండాలి..**
**స్కానింగ్ కేంద్రాలు పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనలు పాటించాలి: ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రజిత**



**హన్మకొండ, నవంబర్ 18(జై భీమ్ న్యూస్)**

గర్భిణులకు అనవసర సిజేరియన్ ఆపరేషన్లు చేయకుండా సాధ్యమైనంతవరకు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ప్రోగ్రాం ఆఫీసర్ (మాతా శిశు సంక్షేమం) డాక్టర్ రజిత ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు సూచించారు. హనుమకొండ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలు, ప్రసవ విధానాలను పరిశీలించి, వైద్యపరంగా అవసరం ఉన్నప్పుడే సిజేరియన్ ఆపరేషన్లు నిర్వహించాలని స్పష్టం చేశారు. సాధారణ ప్రసవాల ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనలను పాటించాలని, సంబంధిత రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. చట్టానికి విరుద్ధంగా వ్యవహరించినా, నిబంధనలను ఉల్లంఘించినా సంబంధిత కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, చట్టబద్ధమైన నిబంధనలను ప్రతి ఆసుపత్రి, స్కానింగ్ కేంద్రం తప్పనిసరిగా పాటించాలని డాక్టర్ రజిత స్పష్టం చేశారు.

## నవీన్ కథలు - పరిశీలన పరిశోధన గ్రంథాన్ని ఆవిష్కరించిన కేయూ ఉపకులపతి



**హన్మకొండ, నవంబర్ 18(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయ తెలుగు విభాగ అధ్యాపకులు, పరిశోధకులు డా. మామిడి లింగయ్య రచించిన “నవీన్ కథలు -- పరిశీలన” పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో కథా ప్రక్రియకు విశిష్టమైన స్థానం ఉందని, సమకాలీన కథా సాహిత్యంపై జరిగే పరిశోధనలు సమాజంలోని సామాజిక, సాంస్కృతిక పరిణామాలను లోతుగా అర్థం చేసుకోవడానికి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. పరిశోధనలో వెలుగులోకి వచ్చిన అంశాలను గ్రంథరూపంలో తీసుకురావడం అభినందనీయమని, ఇలాంటి పరిశోధన గ్రంథాలు తెలుగు సాహిత్య వికాసానికి మరింత తోడ్పడతాయని అన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, సోషల్ సైన్స్ డీన్ ఆచార్య బి. సురేష్ లాల్ రచయిత డా. మామిడి లింగయ్యను అభినందించారు. పరిశోధన గ్రంథాలు అకడమిక్ వికాసానికి దోహదపడటమే కాకుండా భవిష్యత్ పరిశోధకులకు విలువైన మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యులు చిర్ర రాజు, అధ్యాపకులు డా. కర్రె సదాశివ్, టి. అన్నపూర్ణ, డా. బానోత్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు పిల్లల భవిష్యత్తే లక్ష్యం..

**చెత్త వాహనం నడుపుతూ కుటుంబానికి అండగా అశ్విని!**




**నిర్మల్, నవంబర్ 18(జై భీమ్ న్యూస్)**

కుటుంబ బాధ్యతలు, ఇద్దరు చిన్నారుల ఆలనాపాలన.. ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నా వాటికి ఏమాత్రం తలవంచకుండా తన కాళ్లపై తాను నిలబడుతూ పిల్లల భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమిస్తోంది నిర్మల్‌కు చెందిన అశ్విని గణేశ్. మున్సిపల్ చెత్త సేకరణ వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబ పోషణ బాధ్యతను భుజాన వేసుకున్న ఆమె జీవన ప్రయాణం పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. ప్రతిరోజూ తెల్లవారుజామునే విధులకు సిద్ధమయ్యే అశ్వినికి ఇంట్లో ఇద్దరు చిన్నారులను వదిలి వెళ్లే అవకాశం లేకపోవడంతో వారిని తనతోపాటు చెత్త సేకరణ వాహనంలోనే తీసుకెళ్తోంది. ఒకవైపు పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, మరోవైపు స్టీరింగ్ పట్టుకుని తన విధులను బాధ్యతగా నిర్వహిస్తోంది. తల్లిగా పిల్లలపై ప్రేమను చూపిస్తూనే, కుటుంబానికి అండగా నిలిచేందుకు కార్మికురాలిగా నిరంతరం శ్రమిస్తోంది. నిర్మల్ పట్టణంలోని శాస్త్రినగర్, రవినగర్, గొల్లపేట్, రెడ్డి కాలనీ, దివ్యనగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ చెత్తను సేకరిస్తోంది. మున్సిపల్ కాంట్రాక్టర్ అందించిన వాహనంతో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తూ నగర పరిశుభ్రతలో తనవంతు పాత్ర పోషిస్తోంది. ఎండ, వానలను లెక్కచేయకుండా రోజంతా రోడ్లపై విధులు నిర్వహిస్తూ ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ ముఖంపై చిరునవ్వును చెరగనివ్వడం లేదు. అశ్విని చేస్తున్న ఈ ప్రయాణం వెనుక ఎన్నో కష్టాలు, మరెన్నో కుటుంబ బాధ్యతలు దాగి ఉన్నాయి. అయినప్పటికీ పరిస్థితులకు తలవంచకుండా ఇద్దరు బిడ్డల భవిష్యత్తే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఆమె చేతిలోని స్టీరింగ్ కేవలం చెత్త వాహనాన్ని మాత్రమే నడపడం లేదు.. తన పిల్లల బంగారు భవిష్యత్తు ఆశలను కూడా ముందుకు తీసుకెళ్తోంది. కష్టపడితే ఏ పనీ చిన్నది కాదని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవచ్చని అశ్విని జీవితం సమాజానికి చాటిచెబుతోంది. కుటుంబం కోసం ఆమె చేస్తున్న ఈ పోరాటం నిజంగా అభినందనీయం.. ఎందరో మహిళలకు స్ఫూర్తిదాయకం.

## ఇంటర్మీడియట్ విద్య విలీన ప్రతిపాదనపై ప్రభుత్వం పునరాలోచించాలి

**విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి: మార్క శంకర్ నారాయణ**




**హన్మకొండ, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మార్క శంకర్ నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం బాలసముద్రంలో ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యా సంస్కరణలు చేపట్టాలని, ఏకపక్ష నిర్ణయాలతో విద్యావ్యవస్థలో గందరగోళం సృష్టించకూడదని అన్నారు. ఇంటర్మీడియట్ విద్య ఉన్నత విద్యకు పునాది అని, విలీన ప్రతిపాదనపై విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, అధ్యాపక సంఘాలతో సమగ్రంగా చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునే ముందు అన్ని వర్గాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యా కమిషన్ సిఫార్సులను అమలు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. ఇంటర్మీడియట్ విద్య విలీన ప్రతిపాదనపై ప్రభుత్వం తక్షణమే పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు భాష బోయిన సంతోష్, బి. నరసింహారావు, బి. వంశీకృష్ణ, చార్వాక, జక్కుల భాను ప్రసాద్, అనూష, వంశీ, చారి, హేమంత్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## రోస్టర్ పాయింట్లు సవరించాకే అసిస్టెంట్ ప్రొఫెసర్ నోటిఫికేషన్ ఇవ్వాలి!

**కాకతీయ యూనివర్సిటీ వీసీకి మాల సంఘం వినతిపత్రం**
**గ్రూప్-3లోని 26 మాల కులాలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన**



**కేయూ క్యాంపస్, 18 నవంబర్ (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీలో త్వరలో విడుదల కానున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామక నోటిఫికేషన్‌ను ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా రోస్టర్ పాయింట్లను సవరించిన తర్వాతే జారీ చేయాలని మాల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం నాయకులు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు వినతిపత్రం సమర్పిం చారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం 2025 ఏప్రిల్ 14న తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టం ప్రకారం రూపొందించిన రోస్టర్ విధానంలో ఎస్సీ గ్రూప్-3 పరిధిలోని 26 మాల కులాలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసిన 25 ఉద్యోగ నోటిఫికేషన్లలో గ్రూప్-3 కులాలకు తగిన అవకాశాలు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని గత 20 నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రోస్టర్ పాయింట్లలో అవస రమైన సవరణలు చేయకుండానే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తే మాల కులాలకు మరింత అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు వెంటనే స్పందించి రోస్టర్ విధానాన్ని సరిచేసిన తర్వాతే నియామక ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అంస ప్రెసిడెంట్ గుండు రాజేష్, కాంట్రాక్ట్ ప్రొఫెసర్ డాక్టర్ కర్రె సదాశివ, మాల సంఘాల సీనియర్ నాయకులు డాక్టర్ జెట్టి రాజేందర్, డాక్టర్ చందర్‌రావు, డాక్టర్ విష్ణువర్ధన్, చంద్ర మౌళి, పీజీ విద్యార్థి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

**హైదరాబాద్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్) :**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం తప్పదని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం నేత సతీష్ ఆధ్వర్యంలో అబిడ్స్ నుంచి చేపట్టిన చలో సెక్రటేరియట్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. సెక్రటేరియట్‌కు వెళ్తున్న ర్యాలీని పోలీసులు బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తప్పుదోవ పట్టిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకుని పెండింగ్‌లో ఉన్న రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ముఖ్యమంత్రి ఇల్లు , క్యాంప్ ఆఫీస్ లక్షల మందితో ముట్టడిస్తామని హెచ్చరించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

# అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత..

**లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం..**
**పంపిణీ కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**





**హనుమకొండ, 18 నవంబర్ (జై భీమ్ న్యూస్)**

సామాజిక భద్రతే లక్ష్యంగా అర్హులైన పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ మొత్తాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులతో మమేకమై పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వృద్ధాప్యం, అనారోగ్యం, దివ్యాంగత్వం తదితర కారణాలతో ఉపాధి అవకాశాలు పరిమితమైన వారికి పింఛన్లు ఎంతో కీలకమైన ఆర్థిక ఆధారంగా నిలుస్తున్నాయి. ప్రతినెలా అందే పింఛన్ సొమ్ముతో నిత్యావసర సరుకులు, మందులు, వైద్య ఖర్చులు, ఇతర వ్యక్తిగత అవసరాలను కొంతమేర తీర్చుకునే అవకాశం లభిస్తోంది. ముఖ్యంగా కుటుంబ సభ్యులపై పూర్తిగా ఆధారపడకుండా గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు ఈ ఆర్థిక సహాయం తోడ్పడుతోంది.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుందని, సామాజిక భద్రతకు పింఛన్లు ఎంతో దోహదపడతాయని ఈ కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులు చాటిచెప్పారు. చేయూత పింఛన్ల పంపిణీ ద్వారా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలవడంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి స్థల పరిశీలన

## హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**హన్మకొండ, నవంబర్ 18(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ బుధవారం స్థల పరిశీలన చేపట్టారు. కాజీపేట జాగీర్‌లోని ఇందిరమ్మ కాలనీలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి అనువైన స్థలం, నివాసయోగ్యతకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, ఇతర అవసరమైన అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. నిర్మాణానికి అవసరమైన స్థలానికి సంబంధించిన వివరాలను హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ), తహసీల్దార్ రాజును అడిగి తెలుసుకున్నారు. నివాసాలకు అనుకూలంగా ఉండేలా అవసరమైన అంశాలను పరిశీలించి, సంబంధిత వివరాలపై అధికారులతో చర్చించారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# బెంగళూరులో రోబోటిక్ హెర్నియా సర్జరీకి అంతర్జాతీయ నిపుణుల మార్గదర్శనం

**ప్రఖ్యాత అమెరికన్ సర్జన్ డాక్టర్ చాడ్ కాపర్ మెడికవర్ ఆసుపత్రి సందర్శన**
**సాధారణ మరియు తగిన అత్యవసర శస్త్రచికిత్సలలో రోబోటిక్ టెక్నాలజీ ప్రాముఖ్యత**
**మెడికవర్ రోబోటిక్ సర్జరీ బృందంతో విజ్ఞాన వినిమయం**

**బెంగళూరు జై భీమ్ న్యూస్:**

రోబోటిక్ సర్జరీని ఆధునిక వైద్య సంరక్షణలో ఒక అంతర్భాగంగా మార్చే దిశగా ఒక కీలక అడుగు వేస్తూ, ప్రఖ్యాత అమెరికన్ హెర్నియా సర్జన్ మరియు జార్జియాలోని నార్త్ ఈస్ట్ జార్జియా హెల్త్ సిస్టమ్‌లో హెర్నియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ అయిన డాక్టర్ చాడ్ కాపర్, బెంగళూరులోని మెడికవర్ ఆసుపత్రులను సందర్శించి, రోబోటిక్ ఇంగ్వినల్ హెర్నియా సర్జరీపై పర్యవేక్షణలో జరిగిన ఒక సెషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, రోబోటిక్ సర్జరీని కేవలం సంక్లిష్టమైన ప్రక్రియలకే కాకుండా, తగిన రోగులకు చేసే సాధారణ శస్త్రచికిత్సలకు మరియు అవసరమైతే, ఎంపిక చేసిన అత్యవసర శస్త్రచికిత్సలకు కూడా విస్తరించాల్సిన ప్రాముఖ్యతను ఆయన చెప్పారు. మెడికవర్ హాస్పిటల్‌కు చెందిన రోబోటిక్ సర్జన్ డాక్టర్ పృథ్వీరాజ్ సేతుమాధవ్‌తో జరిగిన శస్త్రచికిత్స సమావేశం, హెర్నియా చికిత్సలో అధునాతన రోబోటిక్ టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించడంపై ఆచరణాత్మక జ్ఞానాన్ని పంచుకోవడానికి ఒక వేదికను అందించింది. నిపుణులు శస్త్రచికిత్స పద్ధతులు, రోగి ఎంపిక, శస్త్రచికిత్సకు ముందు ప్రణాళిక మరియు అత్యాధునిక రోబోటిక్ పరికరాల వినియోగంపై చర్చించారు. స్థానిక శస్త్రచికిత్స బృందాలతో అంతర్జాతీయ వైద్య నైపుణ్యాన్ని పంచుకోవడం ఈ పర్యటన యొక్క మరో ముఖ్య ఉద్దేశ్యం. ఈ విషయంలో, డాక్టర్ కాపర్ మెడికవర్ హాస్పిటల్‌లోని యూరాలజీ, ఆంకోసర్జరీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ మరియు జనరల్ సర్జరీ విభాగాల నిపుణులతో సంభాషించారు. మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీ మరియు రోబోటిక్ టెక్నాలజీలో తాజా పరిణామాలు, సవాళ్లు మరియు భవిష్యత్ అవకాశాలపై అనుభవాలను పంచుకున్నారు. మెడికవర్ హాస్పిటల్ ప్రాంతీయ డైరెక్టర్ సిద్ధారెడ్డి, డాక్టర్ ప్రమోద్, డాక్టర్ యమిని చిత్ర, డాక్టర్ సంస్కృతి మరియు డాక్టర్ అబిద్ అలీ మీర్జాతో సహా పలువురు ప్రముఖులు మరియు వైద్య నిపుణులు హాజరయ్యారు.

**రోబోటిక్ సర్జరీ సాధారణ చికిత్సలో భాగం కావాలి**

శస్త్రచికిత్స బృందాన్ని ఉద్దేశించి డాక్టర్ కాపర్ మాట్లాడుతూ, రోబోటిక్ సర్జరీని కేవలం ఒక కొత్త సాంకేతికతగా లేదా సాంప్రదాయ శస్త్రచికిత్సకు ప్రత్యామ్నాయంగా చూడకూడదని అన్నారు. దానికి బదులుగా, సరైన రోగి ఎంపిక, వైద్యుని నైపుణ్యం మరియు అవసరమైన మౌలిక సదుపాయాలతో దీనిని అమలు చేసినప్పుడు, ఇది శస్త్రవైద్యుల సామర్థ్యాలను మెరుగుపరచగల ఒక ప్రధాన వైద్య వేదిక అవుతుందని ఆయన తెలిపారు. రోబోటిక్ సర్జరీని విజయవంతంగా అమలు చేయడానికి కేవలం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండటమే కాకుండా, సర్జన్లకు నిరంతర శిక్షణ, ఆచరణాత్మక అనుభవం, సరైన రోగి ఎంపిక మరియు సాక్ష్యాధారిత వైద్య పద్ధతులను పాటించడం కూడా అవసరమని ఆయన తెలిపారు.

**రోబోటిక్ సర్జరీ: కచ్చితత్వం మరియు అతి తక్కువ కోతతో చేసే చికిత్సకు ఒక కొత్త కోణం**

సాంప్రదాయ లాపరోస్కోపిక్ సర్జరీతో పోలిస్తే, రోబోటిక్ సర్జరీ సర్జన్లకు హై-డెఫినిషన్ త్రిమితీయ (3డి) విజువలైజేషన్, మెరుగైన నియంత్రణ మరియు పరికరాల కదలికలో ఎక్కువ స్వేచ్ఛను అందిస్తుంది. ఇది సంక్లిష్టమైన శరీర భాగాలలో సున్నితమైన శస్త్రచికిత్సా విధానాలను నిర్వహించడాన్ని సులభతరం చేస్తుంది.

**రోబోటిక్ సర్జరీ యొక్క ముఖ్య ప్రయోజనాలు :**

అధిక కచ్చితత్వం మరియు నియంత్రణ: సున్నితమైన కణజాల విభజన మరియు కుట్లు వేసే ప్రక్రియలను మరింత నియంత్రిత పద్ధతిలో నిర్వహించడానికి సహాయపడుతుంది. మెరుగైన 3డి విజువలైజేషన్: శరీరం యొక్క అంతర్గత నిర్మాణాన్ని స్పష్టంగా గుర్తించడానికి మరియు లోతును కచ్చితంగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. కష్టతరమైన ప్రదేశాలలో శస్త్రచికిత్స: శరీరంలోని ఇరుకైన మరియు సాంకేతికంగా సవాలుతో కూడిన భాగాలను సులభంగా చేరుకోవడానికి సహాయపడుతుంది. మెరుగైన సౌకర్యం: రోబోటిక్ కన్సోల్, సర్జన్ సౌకర్యవంతమైన భంగిమలో ఆపరేట్ చేయడానికి అనుమతిస్తుంది. అతి తక్కువ కోతతో చేసే విధానం: చిన్న కోతల ద్వారా శస్త్రచికిత్స చేయగల సామర్థ్యం, ??తగిన రోగులలో తక్కువ నొప్పి, ఆసుపత్రిలో తక్కువ కాలం ఉండటం మరియు వేగవంతమైన కోలుకోవడానికి సహాయపడుతుంది. కచ్చితమైన కుట్లు మరియు పునర్నిర్మాణం: సంక్లిష్టమైన కుట్లు మరియు కణజాల పునర్నిర్మాణం వంటి ప్రక్రియలలో అధిక కచ్చితత్వాన్ని అందిస్తుంది.

**అంతర్జాతీయ సహకారం ద్వారా శస్త్రచికిత్స నైపుణ్యాన్ని బలోపేతం చేయడం**

అత్యాధునిక శస్త్రచికిత్స సాంకేతికతను సమర్థవంతంగా స్వీకరించడంలో అంతర్జాతీయ సహకారం మరియు నిరంతర వైద్య విద్య యొక్క ప్రాముఖ్యతను డాక్టర్ కపర్ పర్యటన మరోసారి చెప్పింది. అనుభవజ్ఞులైన అంతర్జాతీయ నిపుణుల మార్గదర్శకత్వంలో జరిగే పర్యవేక్షిత శస్త్రచికిత్సలు, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి మరియు ప్రత్యక్ష శిక్షణ స్థానిక వైద్య బృందాల నైపుణ్యాలను మెరుగుపరచడంలో సహాయపడతాయి. మెడికవర్ హాస్పిటల్ ప్రకారం, రోగులకు అధునాతన మినిమల్లీ ఇన్వాసివ్ చికిత్సా విధానాలను అందించడం మరియు వివిధ వైద్య విభాగాలలో రోబోటిక్ సర్జరీని తగిన విధంగా విస్తరించడం ద్వారా శస్త్రచికిత్స సంరక్షణ నాణ్యతను మరింత మెరుగుపరచడం ఈ ఆసుపత్రి యొక్క ప్రాథమిక లక్ష్యం. మెడికవర్ హాస్పిటల్ యొక్క రోబోటిక్ సర్జరీ ప్రోగ్రామ్‌కు అంతర్జాతీయ నైపుణ్యం మరియు మార్గదర్శకత్వాన్ని తీసుకురావడంలో, అలాగే బెంగళూరులో అధునాతన రోబోటిక్ మరియు మినిమల్లీ ఇన్వాసివ్ సర్జికల్ సేవలను మరింత బలోపేతం చేయడంలో డాక్టర్ చాడ్ కాపర్ పర్యటన ఒక ముఖ్యమైన పరిణామం.



# రెండు దశాబ్దాల సేవకు ఉద్యోగ భద్రత ఏదీ?






**రెగ్యులరైజేషన్, యూజీసీ పే స్కేల్ అమలు చేయాలని కేయూ కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన**

**కేయూ క్యాంపస్, 18 నవంబర్ (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో రెండు దశాబ్దాలకు పైగా కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా సేవలందిస్తున్న తమను రెగ్యులర్ రిక్రూట్‌మెంట్‌కు ముందే క్రమబద్ధీకరించాలని, గత ఏడాది ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు యూజీసీ పే స్కేల్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు నిరసన బాట పట్టారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లో చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా మొదటిరోజు కేయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కేయూ కాంట్రాక్ట్ అధ్యాపక ఉద్యమ కార్యాచరణ కమిటీ నాయకులు డా. పి. కరుణాకర్ రావు, డా. శ్రీధర్ కుమార్ లోద్, డా. సాదు రాజేష్, డా. మదాసి కనకయ్య మాట్లాడుతూ.. గత ఏడాది 11 రోజుల సమ్మె సందర్భంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను ప్రభుత్వం



వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు దశాబ్దాలకు పైగా తమ జీవితాలను విశ్వవిద్యాలయాల అభివృద్ధికి అంకితం చేసి పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడం, సర్వీసులు క్రమబద్ధీకరణకు నోచుకోకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఉద్యోగ భద్రత లేమితో పలువురు అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు అకాల మరణం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి రెగ్యులర్ నియామకాలకు ముందే కాంట్రాక్ట్ అధ్యాపకుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, యూజీసీ పే స్కేల్ అమలు చేయాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో వివిధ కళాశాలలు, విభాగాలకు చెందిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. బైరి నిరంజన్, డా. రంగారెడ్డి, డా. నాగేశ్వరరావు, డా. చంద్రశేఖర్, డా. సూర్యనారాయణ, డా. ఆరూరి సూర్యం, డా. మామిడి లింగయ్య, డా. శ్రీనివాస్, డా. కృష్ణయ్య, డా. ప్రసాద్, డా. స్వామి, డా. జుల సత్య, తూర్పాటి వెంకటేష్, డా. స్వప్న, డా. కవిత, డా. భాగ్య, డా. కల్పన, డా. రమ, డా. శ్రీలత, డా. సుచరిత పాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఖబర్దార్ రేవంత్ రెడ్డి.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి అల్టీమేటం

**మునుగోడు, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్) :**

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి.. నీకు అధికారం ఉంది కదా అని నేను ఏం చేసినా నడుస్తది అనుకుంటే ఖబర్దార్ బిడ్డా, యుద్ధం స్టార్ట్ అవుతదని వార్నింగ్ ఇచ్చారు. మూడేళ్ల పరిపాలన తర్వాత తెలంగాణ ప్రజలు సంతోషంగా లేరు. తెలంగాణ అంటే కొడంగల్, మధిర మాత్రమే కాదు. ప్రభుత్వంలో ఉన్న నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకొని పనిచేయాలి. ప్రజల సొమ్ము తినే మనిషిని కాదు రేవంత్ రెడ్డి. కాంట్రాక్ట్ టెండర్ ఎంతో చెప్పు దాని కంటే 20 శాతం తక్కువే టెండర్ వేస్తా.. ప్రజల సొమ్ము కాపాడుతానని వ్యాఖ్యానించారు. కొడంగల్‌కు మాత్రమే కాదు, మునుగోడుకు కూడా నిధులు ఇవ్వమని అడిగినందుకు రేవంత్ రెడ్డి నన్ను "పండబెట్టి తొక్కుతా" అంటున్నాడు. నువ్వు తొక్కితే తొక్కించుకునేలా కనిపిస్తున్నానా రేవంత్ రెడ్డి అని నిలదీసారు.

# నవంబర్ 19న ఈపీఎఫ్ఓ కీలక సమావేశం

**పెన్షన్ రూ.3000లకు పెంపు సహా ఉద్యోగుల 10 డిమాండ్లు ఇవే!**

**ఢిల్లీ నవంబర్ 18(జై భీమ్ న్యూస్)**

ఈపీఎఫ్ఓ నవంబర్ 19: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ నవంబర్ 19వ తేదీన సమావేశం కానుంది. ఈ భేటీలో కీలక అంశాలపై చర్చలు, నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అధిక పెన్షన్ దరఖాస్తుల పరిశీలన, కనీస పెన్షన్ రూ.3000లకు పెంపు సహా మొత్తం 10 డిమాండ్లను ఉద్యోగులు, పెన్షనర్లు సీబీటీ ముందు ఉంచారు. మరి ఆ కీలక డిమాండ్లు ఏమిటో ఈ కథనంలో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం రండి. నవంబర్ 19: దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఈపీఎస్-95 అధిక పెన్షన్ దరఖాస్తుదారులు, రిటైర్డ్ ఉద్యోగుల దృష్టి ఇప్పుడు నవంబర్ 19, 2026 రోజున ఢిల్లీలో జరగనున్న ( ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ) ( సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ) 240వ సమావేశంపై ఉంది. ఎలాంటి ముందస్తు విచారణ లేకుండా అధిక పెన్షన్ దరఖాస్తులను పెద్ద ఎత్తున తిరస్కరించడాన్ని తక్షణమే నిలిపివేయాలని కోరుతూ నేషనల్ కన్ఫెడరేషన్ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్స్ కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ, సీబీటీ ముందు 10 కీలక డిమాండ్లను ఉంచింది. సుప్రీం కోర్టు 2022 తీర్పును అమలు చేయకుండా, సాంకేతిక కారణాలు, అంతర్గత సర్క్యులర్ల పేరుతో అర్హులైన పెన్షనర్లను ఇబ్బంది పెట్టడం సరికాదని పెన్షనర్ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. అసలు ఎన్ సి పి లేవనెత్తిన 10 ప్రధాన అంశాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

**ఉద్యోగులు, పెన్షనర్ల 10 కీలక డిమాండ్లు**

ఎన్‌పీసీఓ ప్రతినిదులు సీబీటీ బోర్డుకు సమర్పించిన




వినతిపత్రంలో పది కీలక అంశాలు ఉన్నాయి. 1.నవంబర్ 2022లో సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు, 26 కంటే ఎక్కువ హైకోర్టుల ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగులు తమ అసలు వేతనంపై పెన్షన్ పొందేందుకు అర్హులు. వీటిపై ఈపీఎఫ్ఓ అనవసర అప్పీళ్లు, దరఖాస్తుల తిరస్కరణలు ఆపి తీర్పును యథాతథంగా అమలు చేయాలి. 2.మినహాయింపు పొందిన సంస్థల ఉద్యోగుల అధిక పెన్షన్ అర్హతను వారి అంతర్గత ట్రస్ట్ నిబంధనలతో ముడిపెడుతూ జనవరి 18, 2025న ఈపీఎఫ్ఓ జారీ చేసిన సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలి. ఈ సర్క్యులర్ కారణంగా వేలాది మంది క్లెయిమ్స్ తిరస్కరణకుగురవుతున్నాయి. పార్లమెంట్ ఆమోదించిన 3.ఈపీఎఫ్, ఎంపీ చట్టం 1952, ఈపీఎస్ 95 పథకంలోని స్పష్టమైన నిబంధనలను ఈపీఎఫ్ఓ జారీ చేసే అంతర్గత కార్యనిర్వాహక సర్క్యులర్లు ఎలా అధిగమిస్తాయని ఎన్‌సీపీఏ ప్రశ్నించింది. 4.ఎగ్జెంప్టెడ్, అన్‌ఎగ్జెంప్టెడ్ సంస్థల ఉద్యోగులందరికీ ఒకే రకమైన పెన్షన్ అర్హత నిబంధనలు వర్తింపజేయాలని సుప్రీం కోర్టు చెప్పినా, క్షేత్రస్థాయి కార్యాలయాలు పాత ట్రస్ట్ రూల్స్ పేరుతో క్లెయిమ్స్ రద్దు చేయడం ఆపాలి. 5.ఒకే ప్రభుత్వ రంగ సంస్థ లోని ఒక యూటనిల్లో పని చేసిన ఉద్యోగికి అధిక పెన్షన్ మంజూరు చేస్తే, మరో యూనిట్‌కు బదిలీ అయిన ఉద్యోగి దరఖాస్తును తిరస్కరించే అసంబద్ధ విధానాన్ని సరిదిద్దాలి. 6.ఈపీఎఫ్ఓ వద్ద ఏటా 13 శాతం వృద్ధి చెందుతున్న రూ.11 లక్షల కోట్ల భారీ కార్పస్ నిధి అందుబాటులో ఉన్నప్పటికీ, 2018 నాటి పాత లెక్కలను చూపుతూ ఆర్థిక లోటు పేరుతో అధిక పెన్షన్‌ను నిరాకరించడం సమంజసం కాదు. 7.దరఖాస్తుదారులకు తగిన వివరణ ఇచ్చే అవకాశం ఇవ్వకుండా, యాంత్రికంగా దరఖాస్తులను తిరస్కరించడం ఈపీఎఫ్ఓ సొంత పౌర చార్టర్‌కు విరుద్ధం. 8.దేశంలోని అన్ని రీజినల్ పీఎఫ్ కార్యాలయాలు జాయింట్ ఆప్షన్ దరఖాస్తులను పరిశీలించడంలో ఒకే ఏకరూప విధానాన్ని పాటించేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. 9.ఈపీఎఫ్ఓ ఆలస్యం కారణంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై డిమాండ్ నోటీసుల జారీలో విధించే అదనపు వడ్డీ భారాన్ని పూర్తిగా మాఫీ చేయాలి. 10.అర్హత నిర్ధారణ పూర్తయిన వెంటనే డిమాండ్ నోటీసులు, సవరించిన పెన్షన్ పేమెంట్ ఆర్డర్లు జారీ చేసి, పెన్షనర్లకు బకాయిలతో సహా నెలవారీ అధిక పెన్షన్ అందించాలి.

**కనీస పెన్షన్ రూ.3000లకు పెంపు**

నవంబర్ 19వ తేదీన జరగనున్న సమావేశంలో ఒకవైపు అధిక పెన్షన్ దరఖాస్తుల సమస్యల పరిష్కారంపై ఎన్‌సీపీఏ డిమాండ్లు చర్చకు వచ్చే అవకాశం ఉండగా, మరోవైపు 2014 నుంచి రూ.1000గా ఉన్న కనీస ఈపీఎస్ 95 పెన్షన్ రూ.3000లకు పెంచే ప్రతిపాదనపై కూడా బోర్డు చర్చించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు సూత్రప్రాయంగా పేర్కొన్నాయి.

# ఆధునిక సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన

**కేయూసీఈటీని సందర్శించిన గణపూర్ ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థులు..**
**ఏఐ, కంప్యూటర్ సైన్స్, సైబర్ సెక్యూరిటీపై ప్రత్యేక శిక్షణ**

**హనుమకొండ (జై భీమ్ న్యూస్):**

విద్యార్థులకు తరగతి గదుల్లో అందించే పుస్తక పరిజ్ఞానంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యక్ష అవగాహన కల్పించడం ఉన్నత విద్యకు ఎంతో దోహదపడుతుందని కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ అన్నారు. ఈ నేపథ్యంలో గణపూర్ ప్రభుత్వ మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఈ సందర్శనలో పాల్గొని ఆధునిక సాంకేతిక రంగాలపై ప్రత్యక్ష అవగాహన పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇంజినీరింగ్ కళాశాలలోని వివిధ విభాగాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీలను సందర్శించి అక్కడి విద్యా, పరిశోధన, సాంకేతిక కార్యకలాపాలను పరిశీలించారు. ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం విద్యార్థుల్లో ఆసక్తిని పెంచింది. కంప్యూటర్ సైన్స్ ప్రాముఖ్యత, నూతన సాఫ్ట్‌వేర్ టెక్నాలజీలు, డిజిటల్ అప్లికేషన్ల అభివృద్ధి, భవిష్యత్తులో సాంకేతిక రంగంలో అందుబాటులో ఉండే అవకాశాలను వివరించారు. సిఎస్ఈ విభాగానికి చెందిన తృతీయ సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులు కైపై కుందన్, సాయి కుందన్, అఖిల్, మణికంఠ సాయి అఖిల్ తదితరులు ఇంటర్మీడియట్ విద్యార్థులతో మమేకమై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సమగ్ర అవగాహన కల్పించారు. నేటి ఆధునిక ప్రపంచంలో ఏఐ వినియోగం ఏ విధంగా విస్తరిస్తోంది, విద్య, వైద్యం, పరిశ్రమలు, సమాచార రంగాల్లో ఏఐ ఆధారిత సాంకేతికత ఎలా ఉపయోగపడుతోంది అనే అంశాలను ఉదాహరణలతో వివరించారు. ఏఐ ఆధారిత అప్లికేషన్ల అభివృద్ధి, వాటి పనితీరును కూడా విద్యార్థులకు పరిచయం చేశారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం..**

ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంతో పాటు సైబర్ భద్రతపై అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని ఈ కార్యక్రమంలో వివరించారు. మొబైల్ హ్యాకింగ్, మోసపూరిత లింకులు, ఆన్‌లైన్ మోసాలు, బ్యాంకు ఖాతాల నుంచి అనధికారికంగా నగదు బదిలీ వంటి సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీడియోల ప్రదర్శన ద్వారా సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న మోసపూరిత పద్ధతులను విద్యార్థులకు వివరించారు. గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయకపోవడం, వ్యక్తిగత సమాచారం, ఓటీపీ, బ్యాంకింగ్ వివరాలను ఇతరులతో పంచుకోకపోవడం వంటి జాగ్రత్తలను తెలియజేశారు. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లను బాధ్యతాయుతంగా, సురక్షితంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి ఇండస్ట్రియల్ విజిట్స్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు. తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా విషయ పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా సాంకేతిక విద్యపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఇలాంటి సందర్శనలు భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించేందుకు, నూతన ఆవిష్కరణల దిశగా ఆలోచించేందుకు ప్రేరణ కలిగిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్జీపీ జ్యోతి, రామ్ చంద్ర రెడ్డి పాల్గొన్నారు. ఇంజినీరింగ్ కళాశాల తరపున డాక్టర్ ఎం. సౌజన్య, సెలోని ఫాతిమా, ప్రియాంక, రమణబాబు, వాణి, సుష్మిత, లక్ష్మణ్ నాయక్, భాగ్య, రాజేశ్వరి, రేఖశ్రీ తదితర అధ్యాపకులు పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. మొత్తంగా ఈ ఇండస్ట్రియల్ విజిట్ గణపూర్ ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక ప్రపంచాన్ని దగ్గరగా పరిచయం చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలపై అవగాహన పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో సాంకేతిక విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే ఆకాంక్షను విద్యార్థుల్లో కలిగించింది.



# ప్రపంచ అకాల జనన దినోత్సవం 2026ను జరుపుకుంటున్న బెంగళూరు మెడికవర్ మహిళా మరియు శిశు ఆసుపత్రి

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

వైట్‌ఫీల్డ్ రోడ్‌లో ఉన్న మెడికవర్ మహిళా మరియు శిశు ఆసుపత్రి, ఈరోజు ఎన్ఐసియు నుండి డిశ్చార్జ్ అయిన శిశువులు, వారి కుటుంబాలు మరియు సంరక్షణ బృందాలతో కలిసి ప్రపంచ అకాల జనన దినోత్సవాన్ని జరుపుకుంది. ఈ సంవత్సరం ప్రపంచవ్యాప్త ఇతివృత్తం: "నవజాత శిశువులు, గొప్ప సామర్థ్యం. వారి భవిష్యత్తును కాపాడటానికి తదుపరి సంరక్షణలో పెట్టుబడి పెట్టండి." అకాల జననాల భారం భారతదేశంలోనే అత్యధికంగా ఉంది. 2020లో భారతదేశంలో అంచనా ప్రకారం 30.2 లక్షల మంది శిశువులు నెలలు నిండకుండానే జన్మించారు; ఇది ప్రపంచవ్యాప్తంగా జరిగే మొత్తం అకాల జననాలలో 23శాతం కంటే ఎక్కువ. దేశంలో సంభవించే నవజాత శిశు మరణాలలో దాదాపు సగం అకాల జననం మరియు తక్కువ బరువుతో పుట్టడం వల్లే సంభవిస్తున్నాయి. భారతదేశంలో నవజాత శిశు మరణాల రేటు ప్రతి 1,000 మందికి 18కి తగ్గింది; కానీ కేరళలో ఇది 6గా ఉండగా, కొన్ని రాష్ట్రాలలో 26 వరకు ఎక్కువగా ఉంది. మనుగడ రేట్లు గణనీయంగా మెరుగుపడ్డాయి. మంచి సదుపాయాలు గల లెవెల్ ××× ఎన్ఐసియులలో 28 వారాల తర్వాత పుట్టిన చాలా మంది శిశువులు బ్రతుకుతున్నారు; 400--500 గ్రాముల బరువున్న శిశువులు కూడా చాలా వరకు ఆరోగ్యంగా ఇంటికి తిరిగి వస్తున్నారు. కానీ బ్రతకడం అనేది మొదటి మైలురాయి మాత్రమే. ఈ శిశువులకు దృష్టి (అకాల శిశువుల రెటినోపతి), వినికిడి, పెరుగుదల మరియు నాడీ సంబంధిత అభివృద్ధి కోసం క్రమం తప్పని పర్యవేక్షణ అవసరం.

**పుట్టకముందే అనేక సమస్యలను నివారించవచ్చు. నిరూపితమైన ప్రసవపూర్వ చర్యలు:**

గర్భధారణ తొలినాళ్లలో నమోదు మరియు క్రమం తప్పని ప్రసవపూర్వ తనిఖీలు. రక్తహీనత, అధిక రక్తపోటు మరియు మధుమేహాన్ని నియంత్రించడం. అకాల ప్రసవ ప్రమాదం ఉన్న తల్లులకు, శిశువు ఊపిరితిత్తులు పరిపక్వం చెందడానికి ప్రసవపూర్వ స్టెరాయిడ్ ఇంజెక్షన్లు. 32 వారాల కంటే ముందే ప్రసవం జరిగే అవకాశం ఉంటే, శిశువు మెదడును రక్షించడానికి మెగ్నీషియం సల్ఫేట్ ఇవ్వాలి. ముందుగానే ఉమ్మనీరు పోతే యాంటీబయాటిక్ చికిత్స అందించాలి. పుట్టిన తర్వాత వేరే ఆసుపత్రికి తరలించకుండా, లెవెల్ ××× ఎన్ఐసియు ఉన్న ఆసుపత్రిలో ప్రసవం జరగాలి. "ప్రతి నెలలు నిండని శిశువు ఆరోగ్యంగా పెరిగే అవకాశం పొందాలి. పుట్టకముందు సకాలంలో అందించే సంరక్షణ, ఎన్ఐసియులో నైపుణ్యం కలిగిన చికిత్స, ఇంటికి వెళ్ళిన తర్వాత పక్కాగా పర్యవేక్షించే ఫాలో-అప్ - ఇవన్నీ కలిసే ఆ భవిష్యత్తును నిర్ణయిస్తాయి," అని మెడికవర్ ఉమెన్స్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ శివశంకర్ దిగ్గికర్ అన్నారు. ఈ మెడికవర్ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమానికి ఆసుపత్రి ప్రాంతీయ డైరెక్టర్ సిద్ధారెడ్డి, ఆసుపత్రి సెంటర్ హెడ్ శ్రీవల్లి, డాక్టర్ తేజీ దావనే, డాక్టర్ ప్రవీణ్ వెంకటగి, డాక్టర్ లతీష్, డాక్టర్ వరుణ్ తదితరులు హాజరయ్యారు.



# పిల్లలకు హక్కులతో పాటు బాధ్యతలూ తెలియాలి

**బాలల అక్రమ రవాణా, నివారణపై అవగాహన కల్పించిన డాక్టర్ అనితా రెడ్డి**



**హనుమకొండ ,18 నవంబర్ (జై భీమ్ న్యూస్)**

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పిల్లలకు హక్కులతో పాటు బాధ్యతలపై కూడా అవగాహన కల్పించాలని కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్, ఆనంద నిలయంలో బాలల హక్కుల పరిరక్షణ, బాలల అక్రమ రవాణా, మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ అనితా రెడ్డి విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బిడ్డకు రక్షణ, భద్రతతో పాటు నాణ్యమైన విద్య అందించడం సమాజ లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు. బాలల హక్కులను కాపాడటంతో పాటు వారికి సురక్షితమైన, ఆహ్లాదకరమైన బాల్యాన్ని అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ బాలల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే బాలల హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. బాలల అక్రమ రవాణా, మానవ అక్రమ రవాణా వంటి నేరాల పట్ల పిల్లలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అనితా రెడ్డి సూచించారు. అపరిచిత వ్యక్తులతో పరిచయాలు, వారి మాటలు, ప్రలోభాలకు లోనుకాకూడదని, ఎవరైనా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని వివరించారు. బాలల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని, క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో కొంతమంది బాలలు మాదకద్రవ్యాలకు అలవాటు పడుతుండటం ఆందోళన కలిగించే అంశమని పేర్కొంటూ, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం విద్యారంగానికి గణనీయమైన నిధులు ఖర్చు చేస్తోందని, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లి విద్యను అభ్యసించాలని అన్నారు. విద్య ద్వారానే విజ్ఞానం, ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహన పెంపొందించుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు.

**చలికాలంలో చిన్నారులకు అండగా రగ్గుల పంపిణీ**

అవగాహన కార్యక్రమం అనంతరం చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని సోషల్ వెల్ఫేర్ హాస్టల్, ఆనంద నిలయంలోని చిన్నారులందరికీ డాక్టర్ అనితా రెడ్డి ఉచితంగా రగ్గులు పంపిణీ చేశారు. బాలల విద్య, ఆరోగ్యం, భద్రతతో పాటు వారి కనీస అవసరాలను తీర్చడంలోనూ సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ నిర్వాహకులు సరిత, రాఘవ, విద్యార్థులు పాల్గొన్నారు.

# భూసేకరణ అంశాలపై ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం

**గౌరవెల్లి ప్రాజెక్టు, కొత్త రైల్వే లైన్లు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ భూసేకరణపై చర్చ**




**హన్మకొండ, నవంబర్ 18(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ అంశాలపై ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్నతో పాటు వివిధ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఈ సమావేశంలో గౌరవెల్లి ప్రాజెక్టు, కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు తదితర అభివృద్ధి పనులకు సంబంధించి చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియపై సమగ్రంగా చర్చించారు. సంబంధిత ప్రాజెక్టులకు అవసరమైన భూముల వివరాలు, భూసేకరణకు సంబంధించిన అంశాలు, వివిధ శాఖల మధ్య సమన్వయం తదితర విషయాలను ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుల అమలుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియలో ఎదురయ్యే అంశాలను చర్చించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమాలోచనలు జరిపారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ సీపీఓ రవీంద్ర రెడేకర్, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem INVINCIBLE FOR JUSTICE TV
సామాన్యుడి ఆయుధంగా

# మహిళా, శిశు సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలి







**అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి**
**పోషకాహార లోపాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి**
**వెనుకబడిన ప్రాజెక్టుల అధికారులు పనితీరు మెరుగుపరుచుకోవాలి: జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, నవంబర్ 18(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసేలా అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టడంతో పాటు చిన్నారుల ఎదుగుదల, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం, పోషకాహార లోపాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, సాధికారత కార్యాలయం ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ పథకాల పురోగతిపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని తొమ్మిది ప్రాజెక్టుల అధికారులు, సీడీపీఓలతో నవచేతన కార్యక్రమం, అంగన్వాడీ కేంద్రాల పనితీరు, ప్రజా సంతృప్తి స్థాయిలు, తీవ్ర పోషకాహార లోపాల నివారణ, సంక్షేమ పథకాల అమలు తీరుపై కలెక్టర్ సమీక్షించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించాలని, కీలక పనితీరు సూచికలు, డేటా నమోదు, హాజరు వివరాలు సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. టేక్ హోమ్ రేషన్ పంపిణీ, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, జనని సురక్ష యోజన, బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర సరుకుల సరఫరా, బాలామృతం పంపిణీ, అంగన్వాడీ భవన నిర్మాణాలు, అపార్ ఐడీ, అభా ఐడీ నమోదుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట సీఎస్ఆర్ నిధులను సమర్థవంతంగా వినియోగించి అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన పౌష్టికాహారం సకాలంలో అందించాలని స్పష్టం చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత, పోషకాహార లోపాలను నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను ముందుగానే గుర్తించి వారికి అవసరమైన పౌష్టికాహారం, వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పౌరసరఫరాల శాఖ అధికారులతో పాటు కోడిగుడ్లు, పాలు సరఫరా చేసే కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి టెండర్ నిబంధనల ప్రకారం నాణ్యమైన సరుకులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన, జనని సురక్ష యోజన పథకాల కింద అర్హులైన గర్భిణులందరినీ త్వరితగతిన నమోదు చేసి, వారికి అందాల్సిన ఆర్థిక సహాయం నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చూడాలని ఆదేశించారు. లబ్ధిదారులకు సేవలు అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. మహిళలు, బాలల భద్రతకు సంబంధించి కూడా కలెక్టర్ పలు సూచనలు చేశారు. బాల్యవివాహాల నిరోధానికి గ్రామ, మండల స్థాయి కమిటీలు అప్రమత్తంగా పనిచేయాలని, మిషన్ వాత్సల్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. మహిళల భద్రత, సాధికారత కోసం మిషన్ శక్తి కార్యక్రమాలను బలోపేతం చేయాలని సూచించారు. గృహహింసకు గురైన మహిళలకు వన్ స్టాప్ సెంటర్ ద్వారా తక్షణ న్యాయ, వైద్య, కౌన్సెలింగ్ సహాయం అందించాలని ఆదేశించారు. లింగ నిష్పత్తి మెరుగుదలకు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వెనుకబడిన ప్రాజెక్టుల అధికారులు తమ పనితీరును మెరుగుపరుచుకుని వచ్చే వారంలో ఆశించిన పురోగతి సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సీడీపీఓలు, సూపర్వైజర్లు అంగన్వాడీ కేంద్రాలను నిరంతరం తనిఖీ చేస్తూ పథకాల అమలు తీరును పరిశీలించాలన్నారు. లబ్ధిదారులకు అందుతున్న సేవల నాణ్యతను పెంచి ప్రజా సంతృప్తి సాధించే దిశగా పనిచేయాలని, పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి లక్ష్మి, తొమ్మిది ప్రాజెక్టుల సీడీపీఓలు, ప్రాజెక్టు అధికారులు, సూపర్వైజర్లు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫ్యాన్సీ నంబర్ల కేటాయింపునకు గడువు 60 రోజుల నుంచి 30 రోజులకు కుదింపు

**నేటి నుంచే కొత్త నిబంధనలు అమల్లోకి.. గడువులోగా బుకింగ్, బిడ్డింగ్, చెల్లింపులు పూర్తి చేయాలి**




**GOVERNMENT OF TELANGANA**
**TRANSPORT DEPARTMENT**
Office of the Transport Commissioner, Khairatabad, Hyderabad

**PRESS NOTE**

Date: 18.11.2026

**Sub: Time for obtaining fancy registration numbers reduced from 60 days to 30 days with effect from 19.11.2026**

The Transport Department, Government of Telangana, informs the public that the time allowed to vehicle owners for obtaining a fancy registration number has been reduced from **60 days to 30 days**. This comes into effect from **19.11.2026**.

Vehicle owners who wish to obtain a fancy number are advised to get the number within 30 days from the date of issue of temporary registration (TR), by completing the reservation, bidding and payment within this period. **Otherwise, a random number will be allotted to the vehicle.**

Dealers are requested to inform buyers of this change at the time of sale. For further details, citizens may contact the nearest RTA office.

**Transport Department**
**Government of Telangana**

**హైదరాబాద్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

వాహన యజమానులకు తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ కీలక సూచన చేసింది. వాహనాలకు ఫ్యాన్సీ రిజిస్ట్రేషన్ నంబర్లను పొందేందుకు ఇప్పటివరకు ఉన్న 60 రోజుల గడువును 30 రోజులకు కుదిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త నిబంధనలు నవంబర్ 19, 2026 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ రవాణా శాఖ, ఖైరతాబాద్‌లోని రవాణా కమిషనర్ కార్యాలయం బుధవారం ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఇకపై ఫ్యాన్సీ నంబర్ పొందాలనుకునే వాహన యజమానులు తమ వాహనానికి తాత్కాలిక రిజిస్ట్రేషన్ (టీఆర్) జారీ చేసిన తేదీ నుంచి 30 రోజుల్లోపు నంబర్ రిజర్వేషన్, బిడ్డింగ్‌తో పాటు అవసరమైన చెల్లింపు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. నిర్దేశించిన 30 రోజుల గడువులోగా ఫ్యాన్సీ నంబర్ కోసం దరఖాస్తు చేసుకుని, బిడ్డింగ్, చెల్లింపులు పూర్తి చేయని పక్షంలో సంబంధిత వాహనానికి రవాణా శాఖ యాదృచ్ఛికంగా (రాండమ్‌గా) రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయించనుంది. దీంతో తమకు నచ్చిన ప్రత్యేక నంబర్లను పొందాలనుకునే వారు గడువును తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. అలాగే వాహనాల కొనుగోలు సమయంలోనే డీలర్లు ఈ నిబంధన మార్పు గురించి కొనుగోలుదారులకు స్పష్టంగా తెలియజేయాలని రవాణా శాఖ ఆదేశించింది. కొత్త నిబంధనలపై మరిన్ని వివరాలు, సందేహాల నివృత్తి కోసం వాహన యజమానులు సమీపంలోని ప్రాంతీయ రవాణా కార్యాలయాన్ని (ఆర్టిఏ) సంప్రదించాలని సూచించింది. ఫ్యాన్సీ రిజిస్ట్రేషన్ నంబర్ల కోసం ఎదురుచూస్తున్న వాహనదారులు ఈ మార్పును గమనించి, నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేసుకోవాలని రవాణా శాఖ విజ్ఞప్తి చేసింది.

## పెన్షన్లు పెంచాలి.. హుజూరాబాద్ అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయించాలి

**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు పెంచాలి - ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**కమలాపూర్, నవంబర్ 18(జై భీమ్ న్యూస్)**




పెన్షన్‌దారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లను పెంచడంతో పాటు, హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.1,000 కోట్ల నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. కమలాపూర్ మండలంలో నిర్వహించిన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 45 లక్షల మందికి, హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలో 44,373 మందికి పెన్షన్లు అందించామని గుర్తుచేశారు. సామాజిక భద్రతలో భాగంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య, వితంతు పెన్షన్లను నెలకు రూ.4,000కు, వికలాంగుల పెన్షన్లను రూ.6,000కు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దళితబంధు పథకం ద్వారా లబ్ధి పొందిన కుటుంబాల్లో అర్హులైన వారికి కూడా పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. హుజూరాబాద్ నియోజకవర్గం అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నియోజకవర్గంలోని గ్రామాలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పన, రహదారులు, తాగునీరు, సాగునీటి సమస్యల పరిష్కారం కోసం రూ.1,000 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా, రైతులకు సాగునీటి సమస్యలు ఎదురుకాకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. నీటి వనరుల పరిరక్షణతో పాటు అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా సంక్షేమం, పేదల అభ్యున్నతి, హుజూరాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తూ తన పోరాటాన్ని కొనసాగిస్తానని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.

## లంచం వ్యవహారంలో సర్పంచ్ అరెస్ట్..

**వరంగల్ ఏసీబీ దాడితో కలకలం!**
**రూ.2 లక్షల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబాటు.. తొలుత రూ.30 లక్షలు డిమాండ్.. చివరకు రూ.13 లక్షలకు ఒప్పందం**

**మహబూబాబాద్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**






మహబూబాబాద్ జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన ట్రాప్‌లో ఓ గ్రామ సర్పంచ్ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడటం కలకలం రేపింది. సీరోల్ మండలం మోదుగడ్డ తండా గ్రామ సర్పంచ్ ధరావత్ వీరు రూ.2 లక్షల లంచం స్వీకరిస్తుండగా వరంగల్ ఏసీబీ అధికారుల బృందం పట్టుకుంది. క్వారీ, గ్రానైట్ వ్యాపార కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సహకరిస్తానని చెబుతూ భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం.. మెసర్స్ శారదా స్టోనెక్స్, మెసర్స్ ప్రీమియర్ గ్రానైట్స్, మెసర్స్ రాసి గ్రానైట్స్ సంస్థలకు సంబంధించిన క్వారీ కార్యకలాపాలు సజావుగా కొనసాగేందుకు, వ్యాపారానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారికంగా సహకరిస్తానని చెబుతూ నిందితుడు తొలుత రూ.30 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఆ మొత్తాన్ని రూ.13 లక్షలకు తగ్గించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఫిర్యాదుదారుడి కార్యాలయంలో మొదటి విడతగా రూ.2 లక్షలు అందజేస్తుండగా వరంగల్ ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించి నిందితుడిని పట్టుకున్నారు. ట్రాప్ సమయంలో లంచం సొమ్ము రూ.2 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. తన అధికారిక హోదాను దుర్వినియోగం చేస్తూ అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేసి వరంగల్‌లోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉంది. ఫిర్యాదుదారుడి భద్రత, గోప్యత దృష్ట్యా ఆయన పేరుతో పాటు వ్యక్తిగత వివరాలను ఏసీబీ అధికారులు వెల్లడించలేదు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఏదైనా పని చేసిపెట్టేందుకు లంచం డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా అవినీతి నిరోధక శాఖను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదుల కోసం ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064, వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. అదేవిధంగా ఫేస్‌బుక్, ఎక్స్ వేదికలపై తెలంగాణ ఏసీబీని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రముఖ ప్రజా ప్రదేశాల్లో ఏసీబీ క్యూఆర్ కోడ్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లంచం డిమాండ్‌కు సంబంధించిన సమాచారాన్ని ధైర్యంగా ఏసీబీ దృష్టికి తీసుకురావాలని, ఫిర్యాదుదారుల పేర్లు, వ్యక్తిగత వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని అధికారులు స్పష్టం చేశారు. అవినీతి నిర్మూలనకు ప్రజలు సహకరించాలని, ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఏసీబీ అధికారులు కోరారు.

## కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగ నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలి

**రోస్టర్ సవరణలు పూర్తయ్యాకే అసిస్టెంట్ ప్రొఫెసర్ నోటిఫికేషన్ విడుదల చేయాలి.. మాల సంఘం డిమాండ్**
**వీసీకి వినతిపత్రం సమర్పణ.. డిమాండ్లు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక**



**హన్మకొండ, నవంబర్ 18(జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీలో త్వరలో విడుదల చేయనున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల నోటిఫికేషన్‌కు ముందు ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా రోస్టర్ పాయింట్లను శాస్త్రీయంగా సవరించాలని మాల సంఘం డిమాండ్ చేసింది. రోస్టర్ విధానంలో అవసరమైన మార్పులు చేసిన తర్వాతే ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, యూనివర్సిటీ అధికారులను కోరింది. ఈ మేరకు మాల సంఘం నాయకులు కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025 ఏప్రిల్ 14న తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టం ప్రకారం రూపొందించిన రోస్టర్ విధానం వల్ల ఎస్సీ గ్రూప్-3 పరిధిలోని 26 మాల కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 25 వివిధ ఉద్యోగ నియామక నోటిఫికేషన్లలో గ్రూప్-3 పరిధిలోని కులాలకు రావాల్సిన ఉద్యోగ అవకాశాలు దక్కలేదని ఆరోపించారు. రోస్టర్ విధానంలోని లోపాలను సరిదిద్ది అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలని కోరుతూ గత 20 నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో శాంతియుత ఉద్యమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ రోస్టర్ పాయింట్లలో తగిన సవరణలు చేయకుండా కాకతీయ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం మాల కులాలకు మరింత అన్యాయం చేయడమే అవుతుందని పేర్కొన్నారు. యూనివర్సిటీ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై తక్షణమే స్పందించి రోస్టర్ విధానాన్ని సమీక్షించాలని, అవసరమైన సవరణలు పూర్తిచేసిన అనంతరమే అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పట్టించుకోకుండా నోటిఫికేషన్ జారీ చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంస ప్రెసిడెంట్ గుండు రాజేష్, కాంట్రాక్ట్ ప్రొఫెసర్ డాక్టర్ కర్రె సదాశివ, మాల సంఘాల సీనియర్ నాయకులు డాక్టర్ జెట్టి రాజేందర్, డాక్టర్ చందర్ రావు, డాక్టర్ విష్ణువర్ధన్, చంద్ర మౌళి, పీజీ విద్యార్థి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# టీబీ రోగులకు నిక్షయ్ పోషణ కిట్ల పంపిణీ

**క్షయ వ్యాధి రహిత సమాజమే మన లక్ష్యం..**
**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య**



**హన్మకొండ, నవంబర్ 18(జై భీమ్ న్యూస్)**

క్షయ వ్యాధి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా టీబీ బాధితులకు పోషకాహార సహాయం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా బుధవారం హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో 15 మంది క్షయ వ్యాధి బాధితులకు నిక్షయ్ పోషణ కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ, టీబీ వ్యాధితో బాధపడుతున్న రోగులు వైద్యుల సూచనల మేరకు నిర్ణీత సమయంలో క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. మందులతో పాటు పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నుంచి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. క్షయ వ్యాధి నిర్మూలనకు వైద్య చికిత్సతో పాటు పోషకాహారం కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా కనీసం ఒక టీబీ రోగిని ఆరు నెలల పాటు దత్తత తీసుకొని, వారికి అవసరమైన పోషకాహార సహాయం అందించడంతో పాటు మానసిక ధైర్యాన్ని కల్పించాలని పిలుపునిచ్చారు. దాతలు అందించే సహకారం టీబీ బాధితులు త్వరగా కోలుకోవడానికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకుడు మల్లేశం టీబీ రోగుల సంక్షేమం కోసం 10 నిక్షయ్ పోషణ కిట్లు అందించేందుకు ముందుకు రావడాన్ని డాక్టర్ అప్పయ్య అభినందించారు. సమాజంలోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు టీబీ బాధితులకు సహకరించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉపసంచాలకురాలు డాక్టర్ ఇందిర, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మదన్ మోహన్, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఇన్‌ఛార్జ్ జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి, జిల్లా రోగనిరోధక టీకాల అధికారి కృష్ణారావు, పరిపాలన అధికారి రాజేష్ కుమార్ గౌడ్, ఎంజీఎం ఎయిడ్స్ చికిత్స కేంద్రం సమన్వయ అధికారి డాక్టర్ సూర్యప్రకాష్, మాస్ మీడియా అధికారి ప్రసాద్, గణాంక అధికారి విజయలక్ష్మి, జిల్లా ఆరోగ్య విద్యా అధికారి సందెల శ్రీనివాస్, జిల్లా టీబీ సమన్వయకర్త కిరణ్, నగేష్, సీనియర్ చికిత్స పర్యవేక్షకుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# హసన్‌పర్తిలో ఘోర రోడ్డు ప్రమాదం.. చికిత్స పొందుతూ మేస్త్రి మృతి!

**లారీ-ఆటో ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు.. ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి**
**ఆటో, లారీ డ్రైవర్లపై కేసు నమోదు చేసిన హసన్‌పర్తి పోలీసులు**



**హసన్‌పర్తి, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 563పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బావుపేట క్రాస్ సమీపంలోని గ్రీన్ వ్యాలీ జూనియర్ కాలేజ్ బ్రిడ్జి వద్ద లారీ, ప్యాసింజర్ ఆటో బలంగా ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనతో సూరారం గ్రామంలో విషాదం నెలకొంది. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన మేకల విజేందర్ (46) మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన సయ్యద్ అఫ్జల్‌తో కలిసి ప్యాసింజర్ ఆటో (టిఎస్-03-యూఎ-6041)లో ముచ్చర్ల గ్రామానికి వెళ్లారు. అక్కడ తమ బంధువైన మట్టెడ కుమారస్వామి వద్ద సెంట్రింగ్ సామగ్రిని ఆటోలో లోడ్ చేసుకుని ముగ్గురూ కలిసి సూరారం గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఆటోను మట్టెడ కుమారస్వామి నడుపుతున్నాడు. ఈ క్రమంలో నవంబర్ 17వ తేదీ రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో బావుపేట క్రాస్ సమీపంలోని గ్రీన్ వ్యాలీ జూనియర్ కాలేజ్ బ్రిడ్జి వద్దకు ఆటో చేరుకోగా, ఆటో డ్రైవర్ రాంగ్ రూట్‌లో అజాగ్రత్తగా నడుపుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న లారీ (జిజె-12-సీవీ-6526) ఆటోను బలంగా ఢీకొట్టింది. లారీని బీహార్ రాష్ట్రం వైశాలి జిల్లా యూసుఫ్‌పూర్‌కు చెందిన సచిన్ కుమార్ నడుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మేకల విజేందర్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో నవంబర్ 18వ తేదీ తెల్లవారుజామున 1:01 గంటలకు విజేందర్ మృతి చెందాడు. మృతుడి భార్య మేకల కోమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ మట్టెడ కుమారస్వామి, లారీ డ్రైవర్ సచిన్ కుమార్‌లపై హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ వెల్లడించారు. రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# విద్యార్థుల్లో ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించాలి

**ప్రజాస్వామ్య విలువలను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలి..**
**ములుగు ఆర్డీవో కృష్ణవేణి**



**ములుగు, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్) :**

విద్యార్థుల్లో ఓటు హక్కు ప్రాముఖ్యత, ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించాలని ములుగు రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి సూచించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల (ఈ.ఎల్.సిస్) ఆధ్వర్యంలో బుధవారం ములుగు ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఆర్డీవో కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో ములుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 10 మండలాలకు చెందిన పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో కృష్ణవేణి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ప్రజాస్వామ్య విలువలను తెలుసుకొని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఎన్నికల ప్రక్రియలో చురుకైన భాగస్వాములుగా నిలిచేలా విద్యార్థులను ప్రోత్సహించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. స్వచ్ఛమైన ఓటరు జాబితా ప్రాముఖ్యత, ఓటు హక్కు ఆవశ్యకత వంటి అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా, ఓటరు జాబితా తయారీ, సవరణలు, ఈవీఎంలు, వీవీప్యాట్, పోలింగ్ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థుల ఎన్నికల అవగాహనను పరీక్షించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అధికారులు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించిన అధికారులు భవిష్యత్తులోనూ ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా ఎన్నికల అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని ఆర్డీవో కృష్ణవేణి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, మండల విద్యాధికారి వజ్జ తిరుపతి, డిప్యూటీ తహసీల్దార్ నితీష్, ఎన్నికల అధికారులు, ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి పెట్రోల్ బంక్‌లో భారీ అగ్నిప్రమాదం..

**మంటల్లో చిక్కుకుని వ్యక్తికి తీవ్ర గాయాలు**

**హైదరాబాద్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్) :**

ని కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధి సౌమ్యనగర్‌లో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని స్టార్ట్ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా నిప్పురవ్వలు రావడంతో మంటలు చెలరేగినట్లు సమాచారం. క్షణాల్లో మంటలు వ్యాపించడంతో బైక్‌పై ఉన్న వ్యక్తి మంటల్లో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్పందించిన పెట్రోల్ బంక్ మేనేజర్ మహమూద్, సిబ్బంది ఫైర్ సేఫ్టీ పరికరాలు, బోరు నీటితో మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్నిప్రమాదం మరింత వ్యాపించకుండా సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

## ఎయిడ్స్ నివారణలో హనుమకొండకు 'సురక్షిత్ జిల్లా' గుర్తింపు

**కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు ఘన సన్మానం**



**హన్మకొండ, నవంబర్ 18(జై భీమ్ న్యూస్)**

ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కార్యక్రమాల్లో విశేష పురోగతి సాధించిన హనుమకొండ జిల్లాకు ప్రతిష్టాత్మకమైన 'సురక్షిత్ జిల్లా' గుర్తింపు లభించింది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన 95-95-95 లక్ష్యాలను విజయవంతంగా సాధించిన నేపథ్యంలో ఈ గుర్తింపు దక్కింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉపసంచాలకురాలు డాక్టర్ ఇందిర ఘనంగా సన్మానించారు. కలెక్టర్‌కు శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, హనుమకొండ జిల్లాకు 'సురక్షిత్ జిల్లా' గుర్తింపు రావడం అందరి సమిష్టి కృషి, అంకితభావం, సమన్వయంతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా కొనసాగించాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో మరింత పట్టుదలతో పనిచేసి 'సురక్షిత్ ప్లస్' స్థాయిని సాధించే దిశగా కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మదన్‌మోహన్ రావు, చికిత్సా కేంద్రం సీనియర్ వైద్యాధికారి డాక్టర్ సూర్యప్రకాష్, ప్రజారోగ్య విస్తరణ అధికారి ప్రసాద్, జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి స్వప్న మాధురి, పర్యవేక్షకుడు రామకృష్ణ, లెక్కల అధికారి కమలాకర్, సమగ్ర పరీక్షలు, సలహా కేంద్రం కౌన్సిలర్ రాపర్తి సురేష్, సహాయోగి శిరీష, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు అరోబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.కోటి విరాళం

**పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధికి ఆర్థిక సహాయం..**
**డీజీపీ సీవీ ఆనంద్‌కు చెక్కు అందజేత**



**హైద్రాబాద్, నవంబర్ 18(జై భీమ్ న్యూస్)**

మంచిరేవులలోని యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అభివృద్ధికి అరోబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.కోటి విరాళం అందించింది. పాఠశాలలో మౌలిక వసతుల బలోపేతం, మెరుగైన విద్యా సదుపాయాల కల్పన లక్ష్యంగా ఈ ఆర్థిక సహాయాన్ని అందించింది. ఈ మేరకు బుధవారం డీజీపీ సీవీ ఆనంద్‌కు కోటి రూపాయల చెక్కును అందజేశారు. అరోబిందో ఫార్మా లిమిటెడ్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, అరోబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్ కె. నిత్యానంద రెడ్డి తరఫున ఫౌండేషన్ సీఎస్ఆర్ విభాగం అధిపతి ఎస్. సదానంద రెడ్డి, అరోబిందో ఫార్మా లిమిటెడ్ కార్పొరేట్ వ్యవహారాల ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఐ.ఎస్.ఆర్. రావు డీజీపీకి చెక్కును అందజేశారు. ఈ విరాళం అందించడంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్, సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అరోబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారు. ఈ ఆర్థిక సహాయంతో పాఠశాలలో మెరుగైన విద్యా సదుపాయాల కల్పన, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన అవకాశాలను మెరుగుపరచేందుకు దోహదపడనుంది. ఈ కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్, మహిళా భద్రతా విభాగం డీజీ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్, శాంతిభద్రతల విభాగం అదనపు డీజీ అకున్ సబర్వాల్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేడు చిట్వేలి మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు, అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక

**చిట్వేలి, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్) :**

: చిట్వేలి మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యునితో పాటు మండల పరిషత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ఎన్నికలను ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల లోపు కో ఆప్షన్ సభ్యునిగా ఎన్నిక కావడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేయాలని సూచించారు. నామినేషన్ల పరిశీలన అనంతరం మధ్యాహ్నం 1 గంటకు కో ఆప్షన్ సభ్యుని ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఒకవేళ కో ఆప్షన్ సభ్యుని ఎన్నిక జరుగకపోయినా, మండల పరిషత్ అధ్యక్ష ఉపాధ్యక్షులు ఎన్నిక జరగకపోయినా తదుపరి సమావేశాన్ని ఈ నెల 20వ తేదీకి వాయిదా వేయనున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు స్పష్టం చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

# 95-95-95 లక్ష్యాల సాధనతో వరంగల్ జిల్లాకు "సురక్షిత్ జిల్లా" గుర్తింపు

**జిల్లా కలెక్టర్ సత్యశారదకు ఘన సన్మానం..**
**"సురక్షిత్ ప్లస్" స్థాయికి చేరుకోవడమే లక్ష్యం**

**వరంగల్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**



హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణలో విశేష ప్రగతి సాధించిన వరంగల్ జిల్లా ప్రతిష్టాత్మకమైన "సురక్షిత్ జిల్లా (సురక్షిత్ డిస్ట్రిక్ట్)" గుర్తింపును సాధించింది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) నిర్దేశించిన 95-95-95 లక్ష్యాలను విజయవంతంగా చేరుకోవడంతో జిల్లాకు ఈ గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో జిల్లా సాధించిన విజయానికి గుర్తింపుగా జిల్లా కలెక్టర్ సత్యశారదను తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (టిఎస్ ఎసిఎస్) డిప్యూటీ డైరెక్టర్ ఇందిర ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఇందిర జిల్లా కలెక్టర్ సత్యశారదకు జ్ఞాపిక, శాలువా అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ వరంగల్ జిల్లాకు సురక్షిత్ జిల్లా గుర్తింపు రావడం అన్ని శాఖల అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమిష్టి కృషి, అంకితభావం, సమన్వయంతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత పట్టుదలతో పనిచేసి "సురక్షిత్ ప్లస్" స్థాయిని సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణలో అవగాహన కార్యక్రమాలు, వైద్య సేవలు, సంబంధిత ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ స్వప్న మాధురి, అకౌంటెంట్ కమలాకర్, నాగరాజు, సహయోగి మంజుల, ఎన్జీవో ప్రతినిధులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి







**ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య**

**హన్మకొండ, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జిల్లాలోని ఊరుకొండ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, పుల్కుర్తి సబ్ సెంటర్, దామెర గ్రామీణ కుటుంబ సంక్షేమ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న సాధారణ టీకాల కార్యక్రమాలను (రొటీన్ ఇమ్యూనైజేషన్) పరిశీలించారు. టీకాల కార్యక్రమాలకు సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేసి, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రుల్లో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల నాణ్యతను పరిశీలించి, ప్రతి ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

**సాధారణ ప్రసవాన్ని ప్రోత్సహించిన తల్లికి సన్మానం**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడంలో భాగంగా ఊరుకొండ గ్రామానికి చెందిన వీరబాబు భార్య కీసరి చందనను డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. చందన గత సెప్టెంబర్ 29న ప్రభుత్వ వైద్య సంస్థలో 2.75 కిలోల బరువున్న మగ శిశువుకు సాధారణ ప్రసవం ద్వారా జన్మనిచ్చారు. ఈ సందర్భంగా సాధారణ ప్రసవాల ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆమెను బ్రాండ్ అంబాసిడర్‌గా గుర్తిస్తూ అభినందించారు. ప్రభుత్వ వైద్య సంస్థలపై ప్రజలకు మరింత నమ్మకం పెరిగేలా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ అప్పయ్య సూచించారు. ముఖ్యంగా గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు సురక్షితమైన ప్రసవ సదుపాయాలు కల్పించాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించే దిశగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# గణిత, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

**ఆధునిక బోధనా పద్ధతులు, డిజిటల్ విద్యా వనరులపై అవగాహన**

**వరంగల్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో గణిత, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సమగ్ర శిక్షలో భాగంగా వరంగల్ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బోధిస్తున్న గణిత, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు నవంబర్ 19 నుంచి 26వ తేదీ వరకు నర్సంపేటలోని బిట్స్ కళాశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా అకాడమిక్ పర్యవేక్షణ అధికారి బి. మహేష్ నాయక్ తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా గణిత ఉపాధ్యాయులకు డిజిటల్ అభ్యసన పుస్తకంపై రెండు రోజుల పాటు, ఖాన్ అకాడమీ ద్వారా బోధనా విధానాలపై ఒక రోజు శిక్షణ అందించనున్నారు. గణిత ఉపాధ్యాయులకు మొత్తం మూడు రోజుల పాటు రెండు విడతల్లో శిక్షణ నిర్వహిస్తారు. అదేవిధంగా భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు విజ్ఞాన, సాంకేతిక, ఇంజినీరింగ్, గణిత శాస్త్రాల సమన్వయంతో కూడిన బోధనా విధానాలపై ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఈ కార్యక్రమాన్ని మూడు విడతల్లో నిర్వహించనున్నారు. ఆధునిక బోధనా పద్ధతులు, డిజిటల్ అభ్యసన వనరులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తరగతి గదుల్లో సమర్థవంతంగా వినియోగించుకునే విధానాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించనున్నారు. ఈ మేరకు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అనుబంధ జాబితాలో పేర్కొన్న గణిత, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులను నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం విధుల నుంచి విడుదల చేసి, నర్సంపేటలోని బిట్స్ కళాశాలలో నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అకాడమిక్ పర్యవేక్షణ అధికారి సూచించారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు డిజిటల్ విద్యా వనరులు, ఖాన్ అకాడమీ, విజ్ఞాన శాస్త్ర ఆధారిత బోధనా విధానాలపై నైపుణ్యాలను పెంపొందించుకొని విద్యార్థులకు మరింత సులభంగా, ఆసక్తికరంగా, నాణ్యమైన విద్యను అందించాలని విద్యాశాఖ అధికారులు ఆకాంక్షించారు.

# మేఘా ఇంజినీరింగ్ గ్రూప్ విలువ రూ.లక్ష కోట్లు!

**అంతర్జాతీయ పెట్టుబడిదారుల నుంచి 700 మిలియన్ డాలర్ల పెట్టుబడులు..**
**20కి పైగా దేశాల్లో ప్రాజెక్టులు.. ఇంధన రంగంలోనూ భారీ విస్తరణ**

**హైద్రాబాద్, నవంబర్ 18(జై భీమ్ న్యూస్)**

భారత మౌలిక సదుపాయాల రంగంలో తనదైన ముద్ర వేసిన మేఘా ఇంజినీరింగ్ గ్రూప్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. సంస్థ విలువ సుమారు రూ.లక్ష కోట్లకు చేరినట్లు సమాచారం. అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలైన డీకే, హెచ్‌హెచ్, వర్దే పార్ట్‌నర్స్ భాగస్వామ్యంతో సుమారు 700 మిలియన్ డాలర్ల పెట్టుబడుల సమీకరణకు ఒప్పందం కుదరడం పారిశ్రామిక వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ పెట్టుబడుల లావాదేవీలో నిర్మాణాత్మక ఈక్విటీ పెట్టుబడులతో పాటు రహదారి ఆస్తుల నగదీకరణ ప్రతిపాదనలు కూడా భాగంగా ఉన్నాయి. మేఘా గ్రూప్‌కు చెందిన ఇంధన పరివర్తన సంస్థ ఈపీటీఎల్ విలువను సుమారు రూ.14 వేల కోట్లుగా అంచనా వేయడం విశేషం. అంతర్జాతీయ పెట్టుబడిదారులు సంస్థలో పెట్టుబడులకు ముందుకు రావడం మేఘా గ్రూప్ వ్యాపార విస్తరణకు కీలక పరిణామంగా భావిస్తున్నారు. ప్రస్తుతం మేఘా ఇంజినీరింగ్ గ్రూప్ 20కి పైగా దేశాల్లో వివిధ భారీ ప్రాజెక్టులను చేపడుతోంది. దేశవ్యాప్తంగా 1,975 కిలోమీటర్లకు పైగా రహదారి ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం కలిగి ఉండటంతో పాటు మౌలిక సదుపాయాల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇంధన రంగంలోనూ తన కార్యకలాపాలను విస్తరిస్తూ 9,110 మెగావాట్లకు పైగా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల అభివృద్ధి, 3,000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టుల అమలులో భాగస్వామ్యం కలిగి ఉంది. భవిష్యత్తు ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని అణు విద్యుత్ రంగంలోనూ అడుగుపెట్టింది. అంతేకాకుండా ఎలక్ట్రిక్ బస్సులు, చమురు, సహజ వాయువు, తయారీ రంగం, గ్యాస్ పంపిణీ వంటి విభిన్న రంగాల్లో వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తోంది. దేశంలోని ప్రతిష్టాత్మక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులైన జోజిలా సొరంగ మార్గం, ముంబయి తీర రహదారి, పోలవరం ప్రాజెక్టుల్లో మేఘా గ్రూప్ భాగస్వామ్యం కలిగి ఉంది. నిర్మాణ రంగంలో సాధించిన అనుభవంతో పాటు ఇంధన పరివర్తన, పునరుత్పాదక విద్యుత్, పారిశ్రామిక రంగాల్లోనూ కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. అంతర్జాతీయ పెట్టుబడి సంస్థల నుంచి లభిస్తున్న మద్దతు, వివిధ దేశాల్లో కొనసాగుతున్న ప్రాజెక్టులు, విభిన్న రంగాల్లో వ్యాపార విస్తరణ మేఘా గ్రూప్ ప్రస్థానంలో కీలక పరిణామాలుగా నిలుస్తున్నాయి. సంస్థ విలువ సుమారు రూ.లక్ష కోట్లకు చేరినట్లు వస్తున్న అంచనాలు భారత మౌలిక సదుపాయాల రంగంలో మేఘా గ్రూప్ ప్రాధాన్యతను మరోసారి చాటుతున్నాయి.

# సింగరేణి బకాయిలు విడుదల చేయాలి..

## భూపాలపల్లిలో ఏఐటీయూసీ నిరాహార దీక్షలు

**భూపాలపల్లి, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్) :**

సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెండు రోజుల నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్ దీక్షలను ప్రారంభించగా, వివిధ విభాగాల కార్మికులు, ఫిట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరగడంతో కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఏఐటీయూసీ నేతలు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సంస్థకు చెల్లించాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా మెడికల్ బోర్డులు నిర్వహించాలని, అర్హులకు మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. తొమ్మిది నెలలుగా వీవీటీసీ ఆర్డర్ల కోసం ఎదురుచూస్తున్న కార్మికులకు నెల రోజుల్లో ఆర్డర్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

# కిట్స్‌లో ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు..

**నూతన పుస్తకాల ప్రదర్శన ప్రారంభం**

**వరంగల్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**




విద్యార్థుల్లో పుస్తక పఠన సంస్కృతిని పెంపొందించి, విజ్ఞాన సముపార్జన పట్ల ఆసక్తిని కలిగించాలనే లక్ష్యంతో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్), వరంగల్ కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన నూతన పుస్తకాల ప్రదర్శనను ముఖ్య అతిథిగా విచ్చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), వరంగల్ గ్రంథాలయాధికారి డాక్టర్ వై. శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ పుస్తకాలు మనిషి జీవితానికి మార్గదర్శకాలుగా నిలుస్తాయని, డిజిటల్ యుగంలోనూ పుస్తక పఠనానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విజ్ఞాన, సాంకేతిక, సాహిత్య, సామాజిక అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదివి తమ జ్ఞాన పరిధిని విస్తరించుకోవాలని సూచించారు. గ్రంథాలయాలు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనా శక్తిని పెంపొందించే విజ్ఞాన కేంద్రాలని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల విద్యా వికాసంలో గ్రంథాలయాల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి విద్యార్థి గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకుంటూ నిరంతరం పుస్తక పఠన అలవాటును పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయాధికారి, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ కె. ఇంద్రసేన రెడ్డి మాట్లాడుతూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రధాన ఉద్దేశం పఠన సంస్కృతిని ప్రోత్సహించడం, గ్రంథాలయ సేవలపై అవగాహన కల్పించడమేనని తెలిపారు. 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉత్తమ గ్రంథాలయ వినియోగదారులుగా ఎంపికైన అధ్యాపకులు, విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. సిబ్బంది విభాగంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బి. సాయి కల్యాణ్ ఎంపికయ్యారు. విద్యార్థుల విభాగంలో ఎం.టెక్ (ఎస్సీ) విద్యార్థి పి. శివసిద్ధత్ కేశవ శర్మ, సీఎస్ఎం విభాగానికి చెందిన కె. అనుస్రి ఉత్తమ గ్రంథాలయ వినియోగదారులుగా గుర్తింపు పొందారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, భావవ్యక్తీకరణ, తార్కిక విశ్లేషణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు నిర్వహించిన వ్యాసరచన, చర్చా వేదిక పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వ్యాసరచన పోటీల్లో మెకానికల్ విభాగానికి చెందిన కె.బి. మిలింద్ రెడ్డి ప్రథమ, సీఎస్ఎం విభాగానికి చెందిన సిరి చందన ద్వితీయ, మెకానికల్ విభాగానికి చెందిన ఎన్. హాసిని తృతీయ బహుమతులు సాధించారు. చర్చా వేదిక పోటీల్లో ఎంబీఏ విద్యార్థిని చంద్రిక తడువాయి ప్రథమ, సాత్విక్ సదువాల ద్వితీయ, రిథ్విక రాగళ్ల తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో కిట్స్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, డీన్ అకడమిక్స్ ప్రొఫెసర్ ఎస్. నరసింహారెడ్డి, లైబ్రరీ అడ్వైజరీ కమిటీ చైర్మన్, డీన్ ఆర్ అండ్ డీ ప్రొఫెసర్ బి. రమాదేవి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ పి.ఆర్. రమేష్ రెడ్డి, ప్రొఫెసర్ కె. శ్రీధర్, ప్రొఫెసర్ నిరంజన్, ప్రొఫెసర్ జ్యోతి ప్రభ, అసోసియేట్ ప్రొఫెసర్, పీఆర్ఓ డాక్టర్ డి. ప్రభాకరాచారి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM